

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 110 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 26 ఆగస్టు 2025 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

# పల్లె ఎన్నికలకు అంతా సిద్ధం




- పల్లెల్లో లీడర్లుగా ఎదగడానికి రాజకీయ ప్రాబల్యమున్న మద్దతు ధరలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఇప్పటినుండి తాము పోటీ చేస్తున్నట్టు ప్రకటించుకుని గ్రామాల్లో రచ్చబండ చర్చలు
- అధికార పార్టీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని తమ మద్దతు ధరలను గెలిపించుకోవాలని అన్ని జిల్లాల పార్టీ నాయకత్వాన్ని కోరుకుంది
- గత ఎన్నికల్లో ఓడిపోయిన బిఆర్ఎస్ బిజెపి పార్టీ కూడా స్థానిక సంస్థల్లో ఎక్కువ గెలిచి తమ చాటుకోవాలని సత్తా ఉన్న అభ్యర్థుల కోసం అన్వేషణ చేస్తుంది.

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. పల్లెల్లో లీడర్లుగా ఎదగడానికి రాజకీయ ప్రాబల్యమున్న మద్దతు ధరలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఇప్పటినుండి తాము పోటీ చేస్తున్నట్టు ప్రకటించుకుని గ్రామాల్లో రచ్చబండ చర్చలు ప్రారంభించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ ఎన్నికలు జరగడంతో అధికార పార్టీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని తమ మద్దతు ధరలను గెలిపించుకోవాలని అన్ని జిల్లాల పార్టీ నాయకత్వాన్ని కోరుకుంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన బిఆర్ఎస్ బిజెపి పార్టీ కూడా స్థానిక సంస్థల్లో ఎక్కువ గెలిచి తమ చాటుకోవాలని సత్తా ఉన్న అభ్యర్థుల కోసం అన్వేషణ - మిగతా3లో


# దేశానికి అతిపెద్ద సంపద యువతే

- ఉస్మానియా తెలంగాణ పునర్నిర్మాణానికి సిద్ధంగా ఉండాలి
- వర్శిటీలో కలియతిరిగిన రేవంత్
- అవసరమైతే 1000 కోట్లు ఇస్తాం
- ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో అభివృద్ధి చేస్తా
- యువ నాయకత్వం దేశానికి అవసరం
- విద్యార్థులకు నేను ఇచ్చేది నాణ్యమైన విద్య మాత్రమే
- తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గం
- నేను సీఎం అయ్యాక సామాజిక బాధ్యతగా వర్సిటీలకు వీసీలను నియమించాను.
- "పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి, ఉస్మానియా వర్సిటీ నుంచి వచ్చిన వారే




హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిపై పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రూ.1000 కోట్లు కావాలన్నా ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఓయూను స్థాయిని స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ కోసం ఏడాదికి రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నేటి ఉదయం ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో కొత్తగా నిర్మించిన దుందుభి, బీమా హాస్టల్ భవనాలను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అక్కడే డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఉస్మానియా యూనివర్సిటీ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదు. ఈ యూనివర్సిటీ తెలంగాణ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఇంజనీర్స్ కమిటీని ఏర్పాటు చేసి - మిగతా3లో




## పీఎం మోదీ డిగ్రీ వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు

- ఢిల్లీ హైకోర్టు
- ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది.
- అయితే ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది ఢిల్లీ యూనివర్సిటీ.
- మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించేందుకు యూనివర్సిటీ సిద్ధంగా ఉన్నా, అవి అపరిచితులతో పంచుకోవడం గోప్యత ఉల్లంఘన అవుతుందని ఢిల్లీ యూనివర్శిటీ తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

## మరి మీ ఎంపీలు కూడా ఓట్ చోరీతోనే గెలిచారా?

- మహేష్ కుమార్ ఓట్ చోరీ అంటున్నారు కదా..
- ఇది ఓట్ చోరీ కాదు.. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ
- ముస్లింలకు రిజర్వేషన్‌లు పెంచి బీసీల రిజర్వేషన్‌లు తగ్గించే కుట్ర కాంగ్రెస్ చేస్తోంది
- రాష్ట్రంలో కృత్రిమ యూరియా కొరతకు కాంగ్రెస్ కుట్రలు చేస్తుంది
- మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సృష్టిస్తున్న కృత్తిమ కొరత

నిజామాబాద్

తెలంగాణలో సైతం ఓట్ చోరీ జరిగిందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్ చందర్ రావు స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. మహేష్ కుమార్ ఓట్ చోరీ అంటున్నారు కదా.. ఇది ఓట్ చోరీ కాదు.. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అంటూ మండిపడ్డారు. ఏ ఓటర్ లిస్టుతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందో అదే ఓటర్ లిస్ట్‌తోనే బీజేపీ కూడా గెలిచిందన్నారు. ఈరోజు(సోమవారం, ఆగస్టు 25) నిజామాబాద్ బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రామ్ చందర్‌రావు.. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందనే - మిగతా3లో






## ఇవేం దిక్కుమాలిన జోకులు

- బహిరంగ క్షమాపణలు చెప్పండి!
- సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని
- వారికి జరిమానాలు కూడా విధించాలని కోర్టు ఆదేశం
- కమెడియన్లకు సుప్రీం కోర్టు ఆదేశం

## ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే



- 'రాజ్యాంగ సవరణ'పై విపక్షాలకు అమిత్ షా కౌంటర్
- వాదోపవాదాల్లేకుంటే చట్టసభలు జీవంలేని రాతి భవనాలే
- నైతికత గురించి నాకు చెప్పొద్దు..
- "విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు.
- ధన్‌ఖడ్ రాజీనామా.. ఎక్కువగా లాగొద్దు




## 3,4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు

- కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ST సంస్కరణలపై చర్చ
- మార్పులు, సామాన్య ప్రజలకు లభించే ఉపశమనం కాకుండా, కౌన్సిల్ ప్రభుత్వం ప్రతిపాదించిన 2-రేట్ ఊా నిర్మాణంపై కూడా

## 'బండి సంజయ్ సహా బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారు



- తెలంగాణలో బండి సంజయ్ సహా, బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారు
- ఆ మాటకు నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు
- మాకు తెలంగాణ బీజేపీ ఎంపీల గెలుపుపై అనుమానాలున్నాయి
- ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాస్తాం
- మా నిజామాబాద్ జిల్లాలోనూ దొంగ ఓట్లున్నాయి

కరీంనగర్

తెలంగాణలో బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారని సంచలన ఆరోపణలు చేశారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. రాష్ట్రంలో బీజేపీ ఎంపీల గెలుపుపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. అలాగే, బీహార్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది అంటూ జోస్యం చెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తాజాగా మాట్లాడుతూ.. తెలంగాణలో బండి సంజయ్ సహా, బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారు. ఆ మాటకు నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. మాకు తెలంగాణ బీజేపీ ఎంపీల గెలుపుపై అనుమానాలున్నాయి. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాస్తాం. మా నిజామాబాద్ జిల్లాలోనూ దొంగ ఓట్లున్నాయి. అది నేను నిరూపిస్తాను. మహారాష్ట్రలో కోటి దొంగ ఓట్లు నమోదు చేశారు. నిజామాబాద్‌లోనూ మహారాష్ట్ర ప్రజలకు ఓట్లు ఉన్నాయి. కరీంనగర్‌లోనూ ఓ డబల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. ఓట్లు చోరీ చేసే అవసరం కేవలం బీజేపీకే ఉంది. బీహార్ ఎన్నికల్లోనూ అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రజల్ని చైతన్యపర్చేందుకే రాహూల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారు.

# నీ రూపమే పదివేలు గణపయ్యా..

**రూపుదిద్దుకున్న గణపతులు..**
**ఏడాది కష్టాన్ని మార్కెట్లో పెడుతున్న కార్మికులు..**
**మండపాలకు తరలిపోతున్న గణనాధులు..**





ఏడాది కష్టాన్ని మార్కెట్లో పెడుతున్నారు కార్మికులు.. తుది రూపుదిద్దుకున్న గణపతులు కనువిందు చేస్తుంటే..వేలాది రూపాయలకు కొనుగోలు చేసిన భక్తులు వాటిని మండపాలకు తరలిస్తున్నారు.ఈ ఏడాది సైతం భారీ విగ్రహాలకే భక్తులు మొగ్గు చూపుతున్నారు.

**చేగుంట,ఆగస్టు25(సూర్యరేఖ)** ఒక ప్రక్క మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రచారం జరుగుతున్నా చెవిన పెట్టిన దాఖలాలు లేవు. మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వినాయకుడి బొమ్మల అమ్మకాలు జోరందుకున్నాయి.ఈ ఏడాది భారీ విగ్రహాలు మార్కెట్లో సిద్ధంగా వున్నాయి.ఏదాది పొడవునా విగ్రహాల తయారీలో నిమగ్నమైన కార్మికులు వాటిని మార్కెట్ చేసుకోవడానికి సమాయత్తమయ్యారు.ఒక్కో విగ్రహం రెండు నుంచి పదడుగుల ఎత్తులో భారీ విగ్రహాలు సిద్ధంగా వున్నాయి.మరి కొన్ని రంగులద్దుకుంటున్నాయి. రాజస్థాన్,తదితర ప్రాంతాల నుంచి కార్మికులు ఏడాది పొడవునా విగ్రహాల తయారీలో నిమగ్నమై వుంటున్నారు. వర్షాకాలం మినహా మిగిలిన కాలమంతా వారు రోడ్ల పక్కన స్థలాలు అద్దెకు తీసుకుని గుడారాలు వేసుకుని బొమ్మల తయారీలో వుంటున్నారు.ఇది గాక నెల ముందే వినాయక చవితి మండపాల ప్రతినిధులు చెప్పిన విధంగా విగ్రహాలు తయారు చేసి అందిస్తున్నారు.ఒక్కో విగ్రహం ధర ఈ ఏడాది రూ.10 వేల నుంచి రూ.50వేలు వరకూ పలుకుతున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. సాధ్యమైనంత వరకూ నీటిలో సులభంగా కరిగే మెటీరియల్ వినియోగిస్తున్నామని భారీ విగ్రహాలకు ఫాస్టర్ ఆఫ్ పారీస్ వినియోగించక తప్పడం లేదని చెబుతున్నారు.గణపతి రూపాన్ని ముందుగా తీర్చి దిద్దుకుని ఆర్డర్ ప్రకారం రంగులద్ది అందిస్తున్నామని చెబుతున్నారు.ఇప్పటికే చాలా వరకూ విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయని తెలిపారు.ఈ సీజన్లో అమ్మకం కాని విగ్రహాలను క్లాత్ లతో పార్సిల్ చేసి వచ్చే ఏడాది వరకు భద్రపరుస్తామని తెలి పారు. వినాయక చవితి వరకూ అమ్మకాలు జరిగాక తమ గ్రామాలకు తిరిగి వెళ్తామని తిరిగి పండుగ తర్వాత వచ్చి మళ్లీ విగ్రహాల తయారీలో నిమగ్నమవుతామన్నారు. దసరా సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలు తయారు చేసే వారు మాత్రం ఇక్కడే వుంటారని గణపతి ప్రతిమలతో పోల్చితే అమ్మవారి విగ్రహాలకు గిరాకీ తక్కువేనని చెప్పారు. అన్ సీజన్లో పూల కుండీలు,చిన్న చిన్న విగ్రహాలు, బొమ్మలు తయారు చేసి అమ్ముకుని జీవనం సాగిస్తామని తెలిపారు.

**ఊరూ.. వాడా మండపం :**

చవితి సందడి నెలకొంది.చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఉత్సవాలకు సిద్ధమవుతున్నారు.తొమ్మిది రోజుల పండుగకు ఏర్పాట్లలో మునిగిపోయారు.

**నిర్మాణాల్లో జాగ్రత్తలివి :**

చవితి సందర్భంగా వర్షాలు కురవడం కొన్నేళ్లుగా వస్తున్న ఆనవాయితీ,ఇప్పటికే వాతావరణ శాఖ మరో తుపాను హెచ్చరికలు చేస్తోంది.ఈ తరుణంలో గణపతి మండపాలు పందిళ్ల నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవల్సి వుంది. ఇనుప పైపులు,నాణ్యమైన బరువైన రేకులు వినియోగించాల్సి వుంది. గాలులకు ఎగిరిపోని పటిష్టమైన రేకులు వినియోగించాల్సి వుంది. గాలులకు ఊగిపోని విరిగిపోని విధంగా స్థంబాలు ఏర్పాటు చేయాలి. అదే సమయంలో మంటపాల్లో దీపారాధన, హారతులు అగరవత్తులు వెలిగిస్తున్నందున అగ్నికి అంటుకోని వస్త్రాలు, అలంకరణ సామగ్రి వినియోగించాలి. పెట్రోలు వంటి మండే స్వభావం వున్న వస్తువులను మండపానికి దూరంగా వుంచాలి.

**విద్యుత్ తో ప్రమాదం :**

మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ లు విద్యుత్ శాఖ అనుమతితోనే ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ వైర్ల నుంచి అనధికారికంగా కనెక్షన్ తీసుకోవడం ప్రమాదం.వేలాడే విద్యుత్ వైర్లతో ప్రమాదాలు జరుగుతాయి.ఎటువంటి సమస్య తలెత్తినా విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లాలి సొంత ప్రయోగాలు ప్రమాదానికి



హేతువులు.నాణ్యమైన వైర్లు,విద్యుత్ వస్తువులను మాత్రమే వినియోగించాలి.మంటపాల వద్ద భక్తి రసపాటలు మాత్రమే తగినంత వాల్యూమ్ లో మాత్రమే వినియోగించాలి..

**విగ్రహాలు తరలించే సమయంలో :**


భారీ వినాయక విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలు,చెట్ల కొమ్మలు రహదారులపై గుంతలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు తీగలు వస్తే వాటిని కర్రతో పైకెత్తి తీసుకెళ్లే క్రమంలో విద్యుత్ సిబ్బంది సహాయం తీసుకుని అవసరం అయితే ఆ ప్రాంతంలో విద్యుత్ నిలుపుదల చేయిస్తే మంచిది.విద్యుత్తు తీగల నుంచి కనీసం 2 అడుగుల దూరం పాటించాల్సి వుంది. మెటల్ ఫ్రేమ్లతో కూడిన అలంకరణలను వీలైనంత మేర తగ్గించాలి.

**ఈ అనుమతులు తప్పనిసరి :**

వినాయక మండపాల ఏర్పాటు,ఊరేగింపుల నిర్వహణ సమయాల్లో పోలీసు ముందస్తు అనుమతి తప్పనిసరి అని చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ చైతన్య రెడ్డి తెలిపారు.మండపాల ఏర్పాటుకు ఎవరికి ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదని తెలిపారు.దీనికి సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకుని పొందొచ్చన్నారు. గణేష ఉత్సవ కమిటీగా ఏర్పాడి ఈ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ ద్వారా ఉత్సవాల నిర్వహణ,మండపాల ఏర్పాటు ఊరేగింపులు, నిమజ్జనం వరకూ అనుమతులు పొందొచ్చని ఆన్ లైన్ లో అడిగిన వివరాలు నమోదు చేయడం ద్వారా అనుమతి పొందడం సులభమని ఆయన పేర్కొన్నారు.

# అంధకారం నుంచి వెలుగువైపు: ఉక్రెయిన్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యుద్ధ గాయాలను నయం చేస్తోంది

**కీవ్:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం దెబ్బతీసిన మానసిక వేదన నుంచి బయటపడేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ట్రామా రిలీఫ్, ధ్యానం,శ్వాసాభ్యాస కార్యక్రమాలు వేలాది మంది సైనికులు, స్థలచ్యుతులు, పిల్లలకు కొత్త ఆశను అందిస్తున్నాయి. సైనికులకు నిర్వహించిన మొదటి శిక్షణ శిబిరాలు హృదయాన్ని కలచివేశాయి. “వారి చేతులు, కాళ్లు గాయాలతో నిండిపోయాయి. కళ్లలో భయం, ఖాళీతనం స్పష్టంగా కన్పించాయి” అని ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయుడు తెలిపారు. అయితే శ్వాసాభ్యాసాలు నేర్చుకున్న తర్వాత సైనికులు “ప్రశాంతత, భద్రత, స్థిరత్వం”ను అనుభవించినట్లు చెప్పారు. ఉక్రెయిన్ సైనిక నాయకత్వం గురుదేవ్ పనిని అధికారికంగా గుర్తించింది. బెటాలియన్ కమాండర్ స్వయంగా గురుదేవ్‌కు గౌరవ పురస్కారం అందజేస్తూ, “బాంబులు పడితే మేము పోరాడాము, కానీ మాలోని ఖాళీతనం, కోపం, ద్వేషం గురించి ఎవరూ మాట్లాడలేదు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సుల తర్వాత మా జీవితాలు మారాయి. గాయాలతో ఉన్నవారే ఇప్పుడు భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేస్తున్నారు” అని పేర్కొన్నారు. అంతేకాక, నాయకత్వ శిక్షణలు కూడా సైన్యానికి సహాయపడ్డాయి. “అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఈ శిక్షణ పెంచింది” అని సైన్యం అభినందించింది. 2014 నుండి సైన్యంలో మోరల్ అండ్ సైకాలజికల్ సపోర్ట్ విభాగంలో పనిచేస్తున్న నటాలియా ఒక సంఘటనను గుర్తు చేసుకున్నారు. చిన్న గుంతల్లో దాక్కున్న సైనికుల్లో ఒకరు



భయంతో కదలలేకపోయిన పరిస్థితిని వివరించారు. “అప్పుడు అతనికి విజయ శ్వాస గుర్తొచ్చింది. అది అతని ప్రాణం మాత్రమే కాకుండా మరో నలుగురి ప్రాణాలను రక్షించింది” అని ఆమె తెలిపారు. 2022 నుండి ఇప్పటి వరకు 8,000 మందికి పైగా సైనికులు, స్థలచ్యుతులు, ఆక్రమిత ప్రాంతాల పిల్లలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందారు. వాలంటీర్లు ప్రమాదాలను లెక్క చేయకుండా సేవ చేస్తున్నారు. “అత్యవసరంగా అవసరమైన వారికి తోడుగా ఉండటం మాకు గౌరవం” అని ఒక ఇన్స్ట్రక్టర్ చెప్పారు. యుద్ధం ఎన్నో ప్రాణాలు, కలలను తీసుకుపోయినా, గురుదేవ్ అందిస్తున్నది శాంతి, ఆశ, తిరిగి నిర్మించుకునే శక్తి. “శాంతి అంటే సంఘర్షణ లేకపోవడం కాదు, కరుణ ఉనికిలో ఉండడం” అని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌లో చీకటి నడుమ వెలుగుకి మార్గం చూపుతున్న ఆ కరుణ ఇప్పుడు వేలాది హృదయాలకు ఆధారమవుతోంది.

## ఇవేం దిక్కుమాలిన జోకులు




**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు, వికలాంగులను లక్ష్యంగా చేసుకుని సున్నితత్వం లేని జోకులు వేసిన హాస్యనటులను తీవ్రంగా మందలించింది. ాఓం క్యూర్ ఫౌండేషన్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, హాస్యనటులు సోషల్ మీడియాలో బహిరంగ క్షమాపణలు చెప్పాలని, జరిమానా విధించే అవకాశం కూడా ఉందని ఆదేశించింది.వికలాంగులను లక్ష్యంగా చేసుకుని “సున్నితత్వం లేని జోకులు” వేస్తూ హాస్యం చేసినందుకు సోమవారం సుప్రీంకోర్టు హాస్యనటులపై తీవ్రంగా మండిపడింది. వారి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని, వారికి జరిమానాలు కూడా విధించాలని కోర్టు ఆదేశించింది. వికలాంగుల హక్కుల సంస్థ అయిన ాఓం క్యూర్ ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్య కాంత్, జోయ్‌మల్య బాగ్చిల ధర్మాసనం విచారిస్తూ ఈ ఈ ఆదేశాలు ఇచ్చారు. హాస్యనటులు సమయ్ రైనా, విపున్ గోయల్, బల్రాజ్ పరంజీత్ సింగ్ ఘాయ్, సోనాలి ఠక్కర్, నిశాంత్ జగదీష్ తన్వర్ తమ స్టాండ్-అప్ కంటెంట్‌లో వికలాంగులను ఎగతాళి చేశారని పిటిషన్‌లో ఆరోపించారు.“మీరు కోర్టు ముందు క్షమాపణలు చెప్పారు, మీ సోషల్ మీడియా ముందు కూడా అదే చెప్పండి” అని న్యాయమూర్తులు సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం హాస్యనటులను ఆదేశించింది. జరిమానా లేదా ఖర్చుల ప్రశ్నను తరువాత నిర్ణయిస్తామని ధర్మాసనం తెలిపింది. జీవితంలో హాస్యం ఒక ముఖ్యమైన భాగమే అయినప్పటికీ, ఇతరులతో నవ్వడానికి, వారిని చూసి నవ్వడానికి మధ్య స్పష్టమైన రేఖ ఉందని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి నొక్కి చెప్పారు, అది అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నప్పుడు సహించలేమంటూ మండిపడ్డారు. నేడు చాలా మంది ప్రభావశీలులు ప్రసంగాన్ని “వాణిజ్యీకరించడం” చేస్తున్నారని, దానిని వినోదం కోసం మాత్రమే కాకుండా లాభం కోసం కూడా ఉపయోగిస్తున్నారని ఆయన అన్నారు.

## 3,4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు




**న్యూఢిల్లీ :** ఊూ కౌన్సిల్ 56వ సమావేశం సెప్టెంబర్ 3, 4 తేదీలలో న్యూఢిల్లీలో జరగనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ఊూ సంస్కరణలపై చర్చించనున్నారు. ఊూ 2.0 పన్ను రేట్లలో పెద్ద మార్పులను కలిగి ఉంది. ఊూ నిర్మాణంలో చేసిన మార్పులు, సామాన్య ప్రజలకు లభించే ఉపశమనం కాకుండా, కౌన్సిల్ ప్రభుత్వం ప్రతిపాదించిన 2-రేట్ ఊూ నిర్మాణంపై కూడా ఆలోచిస్తుంది.ఊూ సంస్కరణల కింద 12 శాతం, 28 శాతం స్లాబ్‌లను 5 శాతం, 18 శాతం స్లాబ్‌లలో చేర్చాలనే ప్రతిపాదనను ఉనీఓ గురువారం ఆమోదించింది. ఇప్పుడు దీనిపై కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. మద్యం, జూదం, పొగాకు వంటి వస్తువులపై 40 శాతం ఊూ విధించాలని కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది.ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఊూ రేట్లను తగ్గించే హామీ ఇచ్చారు. ఈ దీపావళి నాటికి దేశంలోని సామాన్య పౌరులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం వస్తువులు, సేవల పన్ను సవరించిన వ్యవస్థలో కేవలం రెండు పన్ను రేట్లను ప్రతిపాదించింది - 5 శాతం, 18 శాతం. దీనితో పాటు, 12 శాతం, 28 శాతం పన్ను స్లాబ్ రద్దు చేస్తారుప్రస్తుతం 0 శాతం, 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం కలిగిన నాలుగు స్లాబ్‌లు ఉన్నాయి, వీటిని తగ్గించి కేవలం స్టాండర్డ్, మెరిట్ అనే రెండు స్లాబ్‌లు మాత్రమే ఉంచుతారు. దేశంలో ఉపాధి కల్పన రంగాన్ని ప్రోత్సహించడానికి, ఊూ పన్ను నిర్మాణంలో 5 శాతం కంటే తక్కువ ప్రత్యేక స్లాబ్ ఉంచుతారు. దీనితోపాటు, 40 శాతం స్లాబ్ కూడా ప్రతిపాదనలో ఉంది. ఇందులో ఐదు నుంచి ఏడు హానికరమైన వస్తువులు ఉంటాయి.ప్రతిపాదన ప్రకారం, 12 శాతం స్లాబ్‌లో చేర్చిన 99 శాతం వస్తువులు 5 శాతం స్లాబ్‌లోకి వస్తాయి. అదేవిధంగా, 28 శాతం స్లాబ్‌లో ఉన్న 90 శాతం వస్తువులు 18 శాతం స్లాబ్‌లోకి మారుస్తారు. చిన్న కార్లపై ఊూని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తారని భావిస్తున్నారు, దీనివల్ల వాటి ధరలు తగ్గుతాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండు-రేట్ల ఊూ నిర్మాణ ప్రతిపాదనను ఊూ కౌన్సిల్ ఆమోదించిన తర్వాత, ఉప్పు, బుజియా, స్నాక్స్, నూడుల్స్, వెన్న, నెయ్యి వంటి సాధారణంగా ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గుతాయి. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, “సామాన్య ప్రజలు వినియోగించే ఆహారం, విద్యకు సంబంధించిన అన్ని అవసరమైన రోజువారీ వినియోగ వస్తువులు సున్నా లేదా 5 శాతం ఊూ స్లాబ్‌లోకి వస్తాయి.”

## పీఎం మోదీ డిగ్రీ వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు




**న్యూఢిల్లీ:** ఎన్నో ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీ వివాదం అంశానికి సంబంధించి తనిఖీకి అనుమతిస్తూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ప్రధాని మోదీ విద్యకు సంబంధించిన రికార్డులను బహిరంగ పర్చాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి నరేంద్ర మోదీ.. బీఏ డిగ్రీ పూర్తి చేశారని చెబుతున్న నేపథ్యంలో, ఆ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే 2016లో కేంద్ర సమాచార కమిషన్.. మోదీ డిగ్రీ రికార్డులను తనిఖీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది ఢిల్లీ యూనివర్సిటీ. ఈరోజు(సోమవారం, ఆగస్టు 25వ తేదీ) సీఐసీ ఆదేశాలను కొట్టేసింది. వ్యక్తిగత గోప్యత హక్కు అనేది తెలుసుకునే హక్కు కంటే మిన్న అని ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. యూనివర్సిటీ విద్యార్థుల రికార్డులు,.. ఆర్టీఐ చట్టం కింద బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని తేల్చింది. మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించేందుకు యూనివర్సిటీ సిద్ధంగా ఉన్నా, అవి అపరిచితులతో పంచుకోవడం గోప్యత ఉల్లంఘన అవుతుందని ఢిల్లీ యూనివర్శిటీ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. దీంతో ఏకీభవించిన హైకోర్టు.. సీఐసీ ఆదేశాలను నిలిపివేస్తూ తీర్పునిచ్చింది. తాజా హైకోర్టు తీర్పుతో ఇప్పటి వరకూ మోదీ డీగ్రీ వివాదంపై జరుగుతున్న రాజకీయ వివాదానికి దాదాపు ముగింపు దొరికినట్లే కనబడుతోంది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం







**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి..**
**రామాయంపేట,నిజాంపేట,నార్సింగి మండల సభ్యత్వ సేకరణ..**

**రామాయంపేట,ఆగస్టు25(సూర్య రేఖ)** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షులు ఎ.శంకర్ దయాల్ చారి అన్నారు. సోమవారం రామాయంపేట నిజాంపేట నార్సింగి మండల కేంద్రాల్లో టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రామాయంపేట పట్టణ అధ్యక్షులు బసనపల్లి మల్లేశం ఆధ్వర్యంలో ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ దయాల్ చారి జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటేనే తమ సమస్యలను పరిష్కరించుకొని హక్కులను సాధించుకోవచ్చని చెప్పారు.టీయూడబ్ల్యూజే ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా పనిచేయదని పార్టీలకు అతీతంగా జర్నలిస్టుల సమస్యల కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మంచి పనులు చేస్తే స్వాగతిస్తామని జర్నలిస్టులకు సమస్యలు సృష్టిస్తే మాత్రం ఎవరిపైనైనా పోరాటం చేస్తామని హెచ్చరించారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పొందని జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్లు మంజూరు అయ్యేలా యూనియన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే జర్నలిస్టులకు త్వరలోనే ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీయూడబ్ల్యూజే ముందుండి పోరాడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ..యూనియన్ సభ్యులు కొత్త వారైనా,పాతవారైనా తప్పనిసరిగా యూనియన్ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యులు మిన్ పూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలో ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా హాస్పటలల్లో పనిచేస్తున్నాయని, అవసరం ఉన్నవారు సంప్రదిస్తే వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఐజేయు నేషనల్ కౌన్సిల్ సభ్యులు బుక్క అశోక్ మాట్లాడుతూ.. దాదాపుగా జిల్లాలో అన్ని మండలాలకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయని,ఇంకా డబుల్ బెడ్రూంలో అందని మూడు నాలుగు మండలాల విలేకరులకు కూడా డబుల్ బెడ్ రూమ్ లు అందే విధంగా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అంపటి సంతోష్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఒక ధైర్యంగా టీయూడబ్ల్యూజే పనిచేస్తుందన్నారు. అనంతరం వివిధ జర్నలిస్టు సంఘాలకు చెందిన పలువురు జర్నలిస్టులు టీయూడబ్ల్యూజేలో చేరారు. వారికి శంకర్ దయాల్ చారి సభ్యత్వ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగరాజు జిల్లా కోశాధికారి వూడెం దేవరాజ్,జిల్లా సంయుక్త కార్యదర్శి మర్కు నగేష్,మాజీ రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మద్దెల సత్యనారాయణ సీనియర్ జర్నలిస్టులు అమరేందర్ రెడ్డి,పటేరి రాము,రాగిలింగం కట్ట ప్రభాకర్ బొంతల సత్యనారాయణ,బల్ల యాదగిరి రామారపు యాదగిరి,కర్రే నరేందర్ నారాయణ ప్రభుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవం







**ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్**

**రాజేంద్రనగర్,ఆగస్టు25(సూర్యరేఖ)** తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి వేడుకలను ఆరంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామిలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తెలుగు సినిమా హీరో శివాజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కృషి,పట్టుదల,క్రమశిక్షణ ఉంటే ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించగలరని నటీనటులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. అదేవిధంగా అదేవిధంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కళాకా రుల పాత్ర అత్యంత కీల కమన్నారు. మనసంస్కృ తి నాగరికత భవిష్యత్తుత రాలను తీర్చిదిద్దడంలో కళాకారులు ప్రధాన భూమిక పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో



అధ్యక్షుడు రాజశేఖర్ గౌరవ అధ్యక్షులు పృద్వి రాజ్,ఆల్ కమిటీ చైర్మన్ నందూరి రామ్,జనరల్ సెక్రటరీ బొయిడీ నూకరాజు ట్రెజరర్ ఎస్సార్ ప్రసాద్,వైస్ ప్రెసిడెంట్స్ పద్మా రేఖ,శ్రీనివాస్ రాథోడ్,ఆర్గనైజ్ సెక్రటరీ కెపి రెడ్డి,జాయింట్ సెక్రటరీస్ ఎస్.రామ్మోహన్,రజిని శ్రీకళ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశ,కమిటీ ఈసీ సభ్యులు,పీవీ ఫెడరేషన్ సభ్యులు,వీఆర్వో గోంగూర శ్రీనివాస రావు అభిమానులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యజమాన్యాలకు ప్రోత్సహించిన వారికి కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

**ఢిల్లీ:** ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్ఐ'కి అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశం పైనా స్పందించారు. "విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు" అని అమిత్ షా అన్నారు.

**వాదోపవాదాల్లేకుంటే**
**చట్టసభలు జీవంలేని రాతి భవనాలే**

"ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?" అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైతికత గురించి నాకు చెప్పొద్దు..**

130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. "రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది" అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

**ధన్‌ఖడ్ రాజీనామా.. ఎక్కువగా లాగొద్దు**

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. "ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు" అని అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. "రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం.

## మరి మీ ఎంపీలు కూడా ఓట్ చోరీతోనే గెలిచారా?

-మొదటిపేజీ తరువాయి

అంశాన్ని ఇక్కడ రామ్ చందర్‌రావు ప్రస్తావించారు. మరి కాంగ్రెస్ ఎంపీలు సైతం దొంగ ఓట్లతో గెలిచారా? అంటూ ప్రశ్నించారు. ' ముస్లింలకు రిజర్వేషన్‌లు పెంచి బీసీల రిజర్వేషన్‌లు తగ్గించే కుట్ర కాంగ్రెస్ చేస్తోంది. రాష్ట్రంలో కృత్రిమ యూరియా కొరతకు కాంగ్రెస్ కుట్రలు చేస్తుంది. దీనిపై మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సృష్టిస్తున్న కృత్తిమ కొరత. రాష్ట్రం లో కాంగ్రెస్ నేతలు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. యూరియా సమస్య పై కాంగ్రెస్ పార్టీ రైతులను రెచ్చ కొడుతుంది. ఓటమి భయం తో.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం భయ పడుతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలు..ఈ రెండు పార్టీలకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు. పసుపు బోర్డు నిజామాబాద్ లో ఏర్పాటు చేయటం మామూలు విషయం కాదు' అని రామ్ చందర్ రావు స్పష్టం చేశారు. కాగా, నిన్న(ఆదివారం, ఆగస్టు 24) టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలోనూ దొంగ ఓట్లున్నాయి.దొంగ ఓట్లతోనే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. దొంగ ఓట్లు లేకపోతే బండి సంజయ్ గెలిచేవారు కాదు. బండిసంజయ్ బీసీ కాదు.. దేశ్‌ముఖ్. కులం మతం లేకపోతే బీజేపీ గెలవదు. దేవుడి పేరుతో మేం ఎన్నడూ ఎన్నికలప్పుడే దేవుడే గుర్తుకొస్తాడు. బీఆర్ఎస్ మూడు ముక్కలైంది.నాల్గవ ముక్క కోసం ఇంకొకరు ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు తప్ప.. వేరే పార్టీకి అవకాశం లేదు'అని వ్యాఖ్యానించారు.

## రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడు.. కేటీఆర్ సెటైర్లు



రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా, తెలంగాణకు ద్రోహం చేయడంలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని, దానివల్ల తెలంగాణ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్మూరు బీజేపీ నాయకురాలు ఆలూరు విజయభారతి, పలువురు బీజేపీ నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. గతంలో మా బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడానికి తాపత్రయ పడుతున్నారు. ఆ కత్తెర పట్టుకుని జాగ్రత్తగా తిరగండి," అంటూ కేటీఆర్ సెటైర్ వేశారు. ఈ రోజు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన రేవంత్ రెడ్డి.. గతంలో కేసీఆర్ పునాది వేసిన భవనాలను ప్రారంభించి వచ్చారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న 'వికృతమైన' మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూసి రేవంత్‌ను బండ బూతులు తిడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకపోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. "గోదావరి నీళ్లను దిగువకు పంపి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నాడు. ఇది మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే జరుగుతోంది" అని అన్నారు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి గోదావరి నీళ్లను కిందికి పంపించేందుకు కుట్ర చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "కాళేశ్వరం నీళ్లు ఆగకుండా, గోదావరి నీళ్లు కిందికి వెళ్లి చంద్రబాబు కడుతున్న బనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలనేది కేంద్రంలోని బీజేపీ, రేవంత్‌కు ఇచ్చిన ఆదేశం. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు," అని కేటీఆర్ తెలిపారు

## జూబ్లీ ఎన్నికలు లిట్మస్ టెస్ట్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా తీసుకుంది. ఈ ఎన్నికల్లో గెలిచి హైదరాబాద్ నగరంలో పార్టీ ఎమ్మెల్యే ఉండేలా ప్లాన్ చేసింది. గత ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో ఒక్క సీటు కూడా రాలేదు. అయితే తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాత్రం సీటు గెలిచింది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో మాత్రం కాంగ్రెస్ అధినాయకత్వం కూడా ఫోకస్ పెట్టింది. ఉప ఎన్నికల్లో గెలిచి గత రెండేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు తమ వైపు మొగ్గు చూపుతున్నారన్న సంకేతాలు ప్రజల్లోకి బలంగా వెళుతుంది. అందుకే జూబ్లీ హిల్స్ ఎన్నికలలో నేడు గాంధీ భవన్ లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ లో కూడా చర్చ జరిగే ఛాన్స్ ఉంది.... జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది ఆశావహులు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక అనివార్యమయింది. అయితే త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంది. ఈ ఎన్నికలో గెలిస్తే మంత్రి పదవి దక్కుతుందన్న భావన ఎక్కువగా కలగడంతో ఎక్కువ మంది జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు. అంతేకాకుండా తమ ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీకి చేస్తున్న ప్రయోజనాలు, గద్దర్ అవార్డులు, కార్మికులు సమ్మెను పరిష్కరించడం వల్ల తమకు అక్కడ ఓట్లు పడతాయని భావిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గెలుపు ఖాయమని భావించి పోటీకి సిద్ధమవుతున్నారు గత ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పోటీ చేశారు. ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పటికే బయట నియోజకవర్గాల నుంచి వచ్చి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని వచ్చిన నేతలకు టిక్కెట్ దక్కదని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడంతో లోకల్స్ కే టిక్కెట్ దక్కే అవకాశాలున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన అజారుద్దీన్ హస్తిన స్థాయిలో తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆయనకు అవకాశాలు ఎక్కువ అని అంటున్నారు. హైకమాండ్ ఆశీస్సులు కూడా ఉన్నాయంటున్నారు. అయితే సర్వే చేయించిన తర్వాత అభ్యర్థిని ఖరారు చేసేందుకు అవకాశాలున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మంత్రులు అక్కడ తరచూపర్యటిస్తుండటం చేయాలని సమావేశం నిర్ణయించే అవకాశముంది.

## ఎట్టకేలకు మూసి ప్రక్షాళన నిధులు


**హైదరాబాద్ :** ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా మూసీ నది ప్రక్షాళణకు తెలంగాణ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఈ క్రమంలోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగాను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.1500 కోట్లలో ప్రస్తుతానికి రూ.375 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళనను ప్రతష్టాత్మకంగా తీసుకున్న సర్కార్ ఇప్పటికే నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను ఇప్పటికే సంగ వరకు తొలగించింది. ప్రస్తుతం మూసీ నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. మూసీ ప్రక్షాళన కోసం రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందం విదేశాలలో పర్యటించి అక్కడ నది మధ్య ఉన్న నగరాలను పరిశీలించడం తెలిసిందే. తాజాగా నిధుల విడుదలకు పరిపాలనా పరమైన నిర్ణయానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేయడంతో మూసీ ప్రక్షాళన మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.మూసీ నది సుందరీకరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కోసం రూ.4,100 కోట్ల రుణం ఇచ్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ ఆమోదం తెలపడం తెలిసిందే. మూసీ ప్రక్షాళన, అభివృద్ధి కోసం నియమించిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్

# తెలంగాణ రాష్ట్రానికి అక్షయపాత్రగా సింగరేణి సంస్థ..

**రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి తోడ్పాటు..**

**కానీ పదవి విరమణ ఉద్యోగులపై సింగరేణి చిన్నచూపు..**

**మంచిర్యాల,ఆగస్టు25(సూర్యరేఖ)** సింగరేణి నల్ల బంగారం మేలిమి బంగారం రాగి ఖనిజాన్వేషణల వైపు అడుగులు వేయడంతో తెలంగాణ గడ్డ పులకించి పోతున్నది.ఆకాశమే హద్దుగా ఇతర రంగాలలోనికి అప్రతహితముగా ముందుకు దూసుకొని పోతున్నది.బొగ్గు ఉత్పత్తిలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ లాభాలను గడిస్తూ తెలంగాణకు ఒక అక్షయపాత్రగా సింగరేణి నిలుస్తుంది.ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన నిధులను సమకూరుస్తున్నది సింగరేణి.ఒక్క మాటలో చెప్పాలంటే బంగారు బాతు గుడ్డుగా సింగరేణి తెలంగాణకు చేదోడుగా నిలుస్తోంది.51:49 శాతం తెలంగాణ కేంద్ర ప్రభుత్వాల వాటాలతో సింగరేణి సంస్థ కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. అనేక రివార్డులు అవార్డులు అందుకుంటూ సంస్థ దేశంలోనే అగ్రగామి నిలుస్తున్నది.సంస్థకు లాభాలకు పునాదులు వేసిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులను మాత్రం సంస్థ విస్మరిస్తున్నది. భూగర్భ గనులలో బొగ్గును వెలికితీయుటకు పైకప్పు పడిపోకుండా కట్టెలను సహాయంగా నిలబెడుతుంటారు.అక్కడ బొగ్గు తీసిన తర్వాత ఈ కట్టెలు నిరుపయోగం అవుతాయి ఇదేవిధంగా సింగరేణిలో అహర్నిశలు చెమట రక్త మాంసాలు ధారపోసి చీకటి గుహలలో విషవాయుల మధ్య అనుక్షణం ప్రమాదంతో బొగ్గును వెలికి తీసి దేశానికి ఇంధనం,విద్యుత్ శక్తిని అందించిన రిటైర్డ్ ఉద్యోగులను ఈ కట్టెల మాదిరిగానే విస్మరిస్తున్నారు.ఇప్పటివరకు సంస్థ స్వంతంగా రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టలేదనేది ఇది ఒక విచిత్రమైన విషయం.ఇతర పారిశ్రామిక సంస్థలలో ప్రభుత్వ శాఖలలో రిటైర్డ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలతో పాటు ఉచిత మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తున్నారు.గోదావరిఖనిలో సంస్థ ఆర్థిక సహాయంతో ఒక వైద్య కళాశాలనే స్థాపించినప్పటికీ రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం నామమాత్రపు వైద్య సౌకర్యాలు అందిస్తున్నారు. మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని



ఓపెన్ కాస్ట్ మట్టి కుప్పలు ఎక్కి మొత్తుకుంటున్న పట్టించుకున్న నాథుడే లేడు. మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి వైద్య సౌకర్యాలు కల్పించుటకు తన వంతు కృషి జరుపుతున్నప్పటికి యాజమాన్యం మాత్రం కనికరించడం లేదు.రిటైర్డ్ ఉద్యోగులకు ప్రస్తుతం కల్పిస్తున్న 8 లక్షల వైద్య సౌకర్యాలకు అదనంగా మరో రెండు లక్షల అమలు చేయాలని,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించినప్పటికీ నేటి వరకు కూడా అమలుకు నోచుకోవడం లేదు.ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వయంగా ఉపముఖ్యమంత్రికి ఇందిరా భవన్ గాంధీభవన్ లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు సార్లు విజ్ఞప్తి చేసిన ఫలితం శూన్యం.ప్రజా కార్మిక నాయకుడు మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి నిరంతరాయంగా ఫోన్ వాట్సాప్ ద్వారా స్పందిస్తూ తన వంతు కృషి చేస్తానని పలుసార్లు హామీ ఇస్తున్నారు.మంత్రి




సోమాజిగూడ నివాసంలో ప్రజాపాలన గాంధీభవన్ లో జరిగిన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేయడం జరిగినది.మంత్రుల చూచనలను, ఆదేశాలను యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఉదాసీన వైఖరి కనబరిస్తున్నది. చైర్మన్ బలరాం కూడా వాట్సాప్ సందేశాలకు స్పందిస్తూ తప్పక మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చినప్పటికీ,కానీ హామీ మాత్రం ఎండమావులుగానే మిగిలిపోతున్నది. చాలీచాలని దుర్లభమైన పెన్షన్ తో జీవనం కొనసాగించలేక అల్లాడిపోతున్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులు.ఇప్పటికే చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు సంస్థ నుండి మెరుగైన వైద్య సంబంధిత ఉపశమనం పొందకుండా అనారోగ్యాలతో వారి అంతిమ విధికి వెళ్ళిపోతున్నారు.

**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు..**

దయార్ద్ర హృదయుడు మానవతావాదిగా సింగరేణియుల హృదయాలను గెలుచుకుంటున్న చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించి రిటైర్డ్ ఉద్యోగుల హృదయాలను కూడా గెలుచుకుంటారని ఆశిస్తున్నాను.మా శేష జీవితాన్ని ఆరోగ్యవంతంగా గడుపుటకు ఆరోగ్య భిక్ష పెడతారని అందుకు సత్వరమే తగు ఆదేశాలు విడుదల చేయాలని మనసారా వేడుకుంటున్నాము.

# ప్రకృతిలో సహజమైన వనరులతో లభించేదే 'జీవామృతం'

**మందమర్రి,ఆగస్టు25(సూర్యరేఖ)** రసాయనాలు అవసరం లేకుండా ఆవుల పేడ, మూత్రం ఉపయోగించి ప్రకృతిలో లభించే సహజమైన వనరుల ద్వారా జీవామృతం అనే సేంద్రీయ ఎరువును తయారు చేసుకోవడం ద్వారా వ్యవసాయాన్ని సుభిక్షంగా కొనసాగించవచ్చని ఈ సహజ ఎరువు సారవంతాన్ని పెంచి పంటలకు మెరుగైన పోషణను అందిస్తుందని మందమర్రి మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. మండలంలోని ఆదిల్ పేట్ గ్రామంలో సోమవారం ద్రవ జీవామృతం తయారీ విధానం సేంద్రీయ ఎరువును వాడుట ద్వారా కలుగు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూరగాయలు పండిస్తున్న రైతులకు జాతీయ సహజ వ్యవసాయ మిషన్ 2025 ద్వారా శిక్షణ ఇచ్చి పంటలు పండించు విధానంపై అవగాహన కల్పించుట జరుగుతుందని,ఎటువంటి రసాయనిక ఎరువులు,పురుగుమందులు వాడకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పర్యావరణాన్ని రక్షించుకుంటూ చేసే సాగు విధానాల్ని సహజ వ్యవసాయంగా పేర్కొంటారని అన్నారు.ఈ ద్రవ జీవామృతం నేలకు అందించుట ద్వారా నేలలో



సూక్ష్మ జీవుల చర్యలు పెరిగి భూసారం అభివృద్ధి చెంది తద్వారా నాణ్యమైన పంటలు పండుతాయని, ఒక ఎకరాకు ఒక్కసారి వాడుటకు 200 లీటర్ల సామర్థ్యం గల డ్రమ్ము ఉపయోగించి 180 లీటర్ల నీరు,10 కిలోల నాటు ఆవు పేడ,10 లీటర్ల నాటు ఆవు మూత్రము,రెండు కిలోల శెనగపిండి,రెండు కిలోల బెల్లము,రెండు కిలోల మంచి పుట్టమన్ను కలుపుకొని వారం రోజులు పులియపెట్టి తరువాత పంటకు అందించుట ద్వారా భూమిలో సూక్ష్మజీవుల చర్యలు పెరిగి సేంద్రీయ కర్బన శాతం పెరిగి పాటుగా పంటకు అందడం ద్వారా నాణ్యమైన సహజసిద్ధమైన రంగు,రుచి నాణ్యత కలిగిన పంటను పొందవచ్చునని,తయారుచేసి విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన పూర్వక పద్ధతి ద్వారా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆదిల్ పేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్య విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయడమే చైతన్య సంస్థ ధ్యేయం..

**రఘురామ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి**



**రాజేంద్రనగర్,ఆగస్టు25(సూర్యరేఖ)** ఆరోగ్య విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయడమే చైతన్య సంస్థ ధ్యేయమని రఘురామ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి అన్నారు.ఆరోగ్యమే మహా భాగ్యం,సామాన్య ప్రజలకు ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడం మహోన్నతమైన భాగ్యమన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవితంలో మానవుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు.మన ఆరోగ్యం మన చేతులలోనే ఉంటుందని వీలైనంత నడక,కొద్దిపాటి వ్యాయామం మన శరీరానికి ఎంతో మేలు చేకూరుస్తాయని,చైతన్య ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ వెంట్రిలాక్విస్ట్,మాజీషియన్ సామ్ గుంటి తెలిపారు. ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా,ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమని ఆయన చైతన్య సంస్థ సేవలను కొనియాడారు.గతంలో కూడా చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ పలు సేవా కార్యక్రమాలకు తాను ముఖ్య అతిథిగా హాజరయ్యానని,ఐతే ఈ క్యాంప్లో అత్యాధునిక వైద్య పరికరాలతో వారు కంటి పరీక్షలను నిర్వహించారని ఆయన తెలియజేశారు.చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్సర్వీస్ సొసైటీ అధ్వర్యంలో బండ్లగూడ, రఘురామనగర్ కాలనీలో జరిగిన వైద్య శిభిరంలో ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు.ఈ కాలనీ మాత్రమే కాక సన్ సిటీ బండ్లగూడ బుద్వేల్,కిస్మత్ పూర్ ప్రాంతాలనుండి సుమారు 226 మందికి కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు.వారిలో కంటి అద్దాలు వాడవలసిన అవసరం ఉన్న 171 మందికి ఈ వారంలోనే కళ్ళద్దాలను కూడా ఉచితంగా అందించబోతున్నామని అన్నారు.సుమారు 84 మందికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ మెడికల్ క్యాంప్లో సుమారు 380 మందికి వైద్య సేవలను అందించగలిగినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైతన్య సంస్థ కార్యక్రమంలో కవిత,ఇంటర్నేషనల్ మాజీషియన్ సామ్ గుంటితో పాటు పూలపల్లి రాజేందర్ రెడ్డి,టింకు రెడ్డి,రఘురామనగర్ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పందిరిని తొలగించే యత్నంలో విద్యుత్ షాక్ ఒకరు మృతి

**సికింద్రాబాద్ :** శుభకార్యం కోసం వేసిన పందిరిని తొలగిస్తున్న క్రమంలో విద్యుతఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుమలగిరి పిఎస్ పరిధిలోని సరస్వతి నగర్ లో చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ తో ఒక వ్యక్తి మృతి చెందగా..మరో ముగ్గురికి గాయాలయ్యాయి. విద్యుతఘాదానికి గురైన వీడియోలు సీసీ కెమెరాలు నమోదయ్యాయి.రిసాలా బజారుకు చెందిన విజయ్ విష్ణు లక్కీ అనే ముగ్గురు వ్యక్తులు దీపక్ అనే వ్యక్తి వద్ద జీవనోపాధి కోసం టెంట్ హౌస్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. సరస్వతి నగర్ లో శుభకార్యం నిమిత్తం వేసిన టెంట్ తీస్తున్న క్రమంలో విద్యుతఘాతంతో విజయ్ అనే వ్యక్తి మృతి చెందగా..లక్కీ,విష్ణులకు గాయాలు అయ్యాయి. టెంట్ హౌస్ యజమాని దీపక్ ఆదేశాల మేరకు నిచ్చెన వేసుకుని టెంట్ తొలగిస్తున్న క్రమంలో టెంట్ హౌస్ ఇనుప రాడ్ కు విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా విద్యుతఘాతం జరిగింది. నిచ్చెన పైన ఉన్న విజయ్ కి తీవ్రగాయాలు కాగా నిచ్చెన పట్టుకొని ఉన్న విష్ణు,లక్కీలకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ సమాచారం అందించారు. హుటాహుటిన వారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ విజయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న తిరుమలగిరి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారు

**ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శ**

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ భవన్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే అందరికి ఆత్మీయత ఎక్కువ. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్వాస దోషాలతో రేవంత్ రెడ్డి లైన్లో నడుస్తున్నారన్నారు. అప్పులపై స్పీకర్ అబద్దాలు చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన రూ.3 లక్షల 50 వేల 520 కోట్లు అని పార్లమెంటులో కేంద్రమంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపి స్పీకర్ ప్రసాద్ కుమార్ సీఎం కావాలన్నారు.ర్లమెంట్లో రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అప్పులపై సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ కోసం యాదయ్య, శ్రీకాంతాచారి ఆత్మబలిదానాలు చేసుకుంటే రేవంత్ మాత్రం చంద్రబాబు నాయుడు సంకలో ఉన్నారని ఎద్దేవా చేశారు. నేను కుమార్ను ఓయూ వైస్ ఛాన్సలర్ ను చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. దీంతో రేవంత్ రెడ్డి ఫ్యూడలిజం, భూస్వామ్య మనస్తత్వం బయటపడిందన్నారు. ఓయూలో కాళేశ్వరం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు . జీవో 29 పేరు మీద రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు.

## భర్త భార్యను చంపాడు కానీ అతి కిరాతకంగా చంపాడు

**మల్కాజిగిరి డిసిపి పద్మజా రెడ్డి**

**హైదరాబాద్ :** భార్యను హతమార్చి ముక్కలు ముక్కలు చేసి మూసి నదిలో పడేసిన కేసు వివరాలు మల్కాజిగిరి డీసీనీ పద్మజా రెడ్డి మీడియాకు వెల్లడించారు. స్వాతి, మహేంద్ రెడ్డి ఇద్దరు లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. పెళ్లి అయిన తర్వాత ఇద్దరు మధ్య నాలుగు సార్లు గొడవలు జరిగాయి. ఒక సంవత్సరం క్రితం అమ్మాయి కి అబార్షన్ చేయించాడు. స్వాతి మళ్ళీ గర్భవతి అయింది. మెడికల్ చెకప్ తర్వాత ఇంటకి వెళ్తా అనగానే గొడవ పడి ఆమెను కొట్టాడు. బయటకు వెళ్లి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఆమెను కొట్టగా కళ్ళు తిరిగి కోమాలో పోయింది. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు బాడీ పార్ట్స్ అన్ని కోసేసి మూసి నదిలో పడేశాడని అన్నారు. మూడు సార్లు మూసి వద్దకు వెళ్లి శరీర భాగాలు పడేసాడు. ఆ తర్వాత తన భార్య కనబడటం లేదని మహేందర్ తన చెల్లికి విషయాన్ని చెప్పాడు. మహేందర్ చెల్లి భర్త నరేందర్ రెడ్డి కి అనుమానం కలిగి మిస్సింగ్ కింద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మహేందర్ బంధువు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ తో మహేందర్ రెడ్డిని అరెస్ట్ చేశాం. ఘటన జరిగిన స్థలంలో పలు ఆధారాలు సేకరించడనీ జరిగింది. స్వాతి బాడినా లేదా ర మరో మహిళ అని నిర్ధారణకు డిఎన్ఎ టెస్ట్ నిర్వహిస్తాం.

సూర్య


# బెల్లంపల్లి బజార్‌లో కబ్జాల జోరు ప్రజల నరకయాతన

**ప్రజావాణిలో సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతి పత్రం అందించిన కొలిపాక శ్రీనివాస్..**





**బెల్లంపల్లి,ఆగస్టు25(సూర్యరేఖ)** బెల్లంపల్లి బజార్ ఏరియా,కాంట్రాక్టర్ బస్తీ రహదారులు అక్రమ కబ్జాలతో నిండిపోగా,పాత గీత మహల్ హోటల్ వెనుక కాలువ చెత్త,బురదతో మూసుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.2001లో 180షాపులు కూల్చినా మళ్లీ కబ్జాలు పెరగడం పట్టణానికి శాపమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యలపై పట్టణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వందలాది ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ మనోజ్ కి వినతి పత్రం అందజేశారు.అక్రమ కబ్జాలు తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం స్టేట్ బ్యాంక్ రోడ్డువరకు రహదారి వేయడం,రాబోయే వినాయక చవితిదసరా దీపావళి దృష్ట్యా పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని వారు డిమాండ్ చేశారు. సిఎం దృష్టికి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా సమస్యలు నివేదించామని బెల్లంపల్లి ప్రజల గతి మార్చకపోతే పెద్ద ఉద్యమం తప్పదని కొలిపాక శ్రీనివాస్ హెచ్చరించారు. మనోజ్ చొరవపై ప్రశంసలు.. వినతిని ఓర్పుతో విన్న సబ్ కలెక్టర్ మనోజ్ ప్రజల సమస్యల పరిష్కారంపై ఆయన చూపుతున్న కట్టుబాటు స్థానికుల్లో నూతన నమ్మకాన్ని కలిగిస్తోంది.పట్టణ భవిష్యత్తు మార్పుకు ఆయన కృషే బలమని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీడీ పరిశ్రమ సంక్షోభానికి కారణం కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలే..

**బీడీ కార్మికుల హక్కుల రక్షణ కోసం కార్మికులు పోరాడాలి..**

**బీడీ కార్మికుల సమస్యలపై డిసెంబర్ లో జరిగే రాష్ట్ర మహాసభల్లో చర్చ..**








**రామాయంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** బీడీ పరిశ్రమ రక్షణ కోసం పరిశ్రమలోని అన్ని కేటగిరీల కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కాముని గోపాలస్వామి పిలుపునిచ్చారు.డిసెంబర్ 7,8,9 తేదీల్లో మెదక్ పట్టణంలో జరిగే సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలో బీడీ కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు.రాష్ట్ర మహాసభల సందర్భంగా"బీడీ పరిశ్రమ సంక్షోభం కేంద్ర ప్రభుత్వ విధానాలు అంశంపై సోమవారం రామాయంపేట లోని ఎర్రం విఠల్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సెమినార్లో గోపాలస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.మినీ సిగరెట్ తయారు చేసే కార్పొరేట్ పరిశ్రమలను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమను ఉదేశ్య పూర్వకంగానే సంక్షోభంలోకి నెడుతుందని అన్నారు.లక్షలాది మందికి ఉపాధి చూపెడుతున్న బీడీ పరిశ్రమ జీఎస్టీ పేరుతో పన్నుల భారాన్ని పెంచడం ద్వారా బీడీ పరిశ్రమ సంక్షోభం లోకి వెళ్ళి కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని అన్నారు.ప్రభుత్వ విధానాలతో బీడీ పరిశ్రమ సంక్షోభం ఒక వైపు ఐతే యాజమాన్యాలు మరో వైపు వేతనాల్లో కోత విధిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. పెరిగే ధరలతో పోలిస్తే ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలను రక్షించడానికి కార్మికుల విత్తనాల పెంపుదల జి.ఓలు విడుదల చేయడం లేదన్నారు.ఒక వైపు ధరల భారం తక్కువ కులితో సతమతం అవుతుంటే నకిలీ ఆకు తంబాకు,బీడీలలో కోత విధించడం మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు బీడి కార్మికుల స్తితి ఉందని గోపాలస్వామి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నూతన బీడీ కార్మికుల జీవన భృతి మంజూరు కాలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తుందన్నారు.బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప మార్గం లేదని గోపాలస్వామి పిలుపునిచ్చారు.అంతరం సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడుతూ...మెదక్ జిల్లాలో బీడీతో సహా అన్ని రంగాల కార్మికులు సిఐటియు రాష్ట్ర మహాసభల జయప్రదానికి సహకరించాలని అన్నారు.రాష్ట్ర మహాసభల అనంతరం జిల్లాలో అన్ని రంగాల కార్మికుల కోసం ఉదృతమైన పోరాటాలు నిర్వహిస్తామన్నారు.వికలాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య మాట్లాడుతూ... సిఐటియు మహాసభల జయప్రదానికి తమ సంఘం పూర్తిగా సహకరిస్తుందన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం సందేశం ఇచ్చారు.బీడీ సంఘం జిల్లా కార్యదర్శి బి.బాలమణి ఈసెమినార్ కు అధ్యక్షత వహించగా సంఘం జిల్లా అధ్యక్షులు మంజుల పద్మ,గౌతం,జిల్లా కమిటి సభ్యులు లహరి తదితరులు పాల్గొన్నారు.

# జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డికి ఘనంగా నివాళులర్పించిన ఉప్పల్ కాంగ్రెస్ నేతలు





**ఉప్పల్,ఆగస్టు25 (సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పి.ఏ.జైపాల్ రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రరెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసి వారి గ్రామం తిర్మలాపూర్,నాగర్ కర్నూల్ జిల్లా వెళ్లి వెల్దండ రాంచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.జైపాల్ రెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,చైర్మన్ ఫయీమ్,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి,పీసీసీ మాజీ యూత్ జనరల్ సెక్రెటరీ గడ్డం రవికుమార్, రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తవిడబోయిన గిరిబాబు, బరంపేట కృష్ణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని రామచంద్రారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## బట్వాన్ పల్లి ప్రజల వినతికి స్పందించిన సబ్ కలెక్టర్




**బెల్లంపల్లి,ఆగస్టు25(సూర్యరేఖ)** బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామ శివారులోని సర్వే నం.8లో ఉన్న గ్రామ చావిడి పరంపోగు ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని కబ్జా చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.గ్రామస్తుల వినతిపత్రాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కి సోమవారం అందజేశారు.ఆ వ్యక్తి కేవలం ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా చుట్టూ కంచె వేసి,ప్రభుత్వ విద్యుత్ స్తంభం నుండి అక్రమంగా కనెక్షన్ తీసుకొని గ్రామ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. గ్రామ చావిడి పరంపోగు భూమి ప్రజల సొత్తు దానిని వ్యక్తిగతంగా మలుచుకోవడం నేరం..అక్రమ పట్టాను శాశ్వతంగా రద్దు చేసి, సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని కోరారు.వినతిని స్వీకరించిన సబ్ కలెక్టర్ మనోజ్ సానుకూలంగా స్పందిస్తూ,విషయంపై దర్యాప్తుచేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యార్థులు జాగ్రత్త మత్తు పదార్థాలు భవిష్యత్తును కబళిస్తాయి..

**బెల్లంపల్లి రూరల్ సీఐ అనుక్ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమం..**



**బెల్లంపల్లి,ఆగస్టు25 (సూర్యరేఖ)** బెల్లంపల్లిలో పాఠశాలలు,కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి 2 టౌన్ పోలీసులు సూచించారు. గంజాయి,మత్తు పదార్థాలు ఒక్క క్షణం ఆనందం ఇచ్చినా జీవితాన్ని శాశ్వతంగా చీకటిలోకి నెడతాయి "అని వారు హెచ్చరించారు.మత్తు పదార్థాలు శరీరాన్ని బలహీనపరుస్తాయని, మనసును దెబ్బతీస్తాయన్నారు.ఒకసారి అలవాటు అయితే చదువు,ఉద్యోగం,కెరీర్ మొత్తం నాశనం అవుతుంది.స్నేహితుల ఒత్తిడికి లోనవకుండా, నోఅనడం నేర్చుకోండి.ఎవరో గంజాయి,మత్తు పదార్థాలు వినియోగిస్తుంటే వెంటనే గురువులకు లేదా పోలీసులకు చెప్పండి.

**చదువే భవిష్యత్తు..**

మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది.పుస్తకాలు పట్టుకోండి,మత్తు పదార్థాలను వదిలేయండి.మీరు మంచి చదువు చదివి,మంచి ఉద్యోగం సాధించి, మీ కుటుంబానికి గర్వకారణం అవ్వాలి అని పోలీసులు విద్యార్థులకు పిలుపునిచ్చారు.

**పోలీసుల వాగ్దానం..**

మత్తు పదార్థాల వ్యాపారం,వినియోగం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవుఫిర్యాదు చేసిన వారి గోప్యతకాపాడబడుతుందివిద్యార్థుల భవిష్యత్తు కాపాడటానికి ఎల్లప్పుడూ పోలీసులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. బెల్లంపల్లి పోలీసులు విద్యార్థుల భవిష్యత్తు కోసం మీతోనే ఉన్నారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్య లేని డివిజన్ గా తీర్చిదిద్దడమే నాలక్ష్యం..

**బొహిని దర్శన్**



**నాంపల్లి,హైద్రాబాద్,ఆగస్టు25 (సూర్యరేఖ)** ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జియాగూడలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జిహెచ్ఎంసి భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బొహిని దర్శన్ తెలిపారు.డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ బొహిని దర్శన్ మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజి స్థానంలో నూతన డ్రైనేజీ పనులు చేపట్టామని,ఇంకా చేపడుతున్నామని తెలిపారు. వర్షాలు పడ్డప్పుడు పాడై గుంతలతో ఇబ్బందులు కలిగించిన రోడ్ల స్థానంలో బస్తీలు,కాలనీలలో అన్ని రోడ్లను కొత్తగా వేయడం,తాగునీటి వ్యవస్థను మెరుగు పర్చడం జరుగుతోందని అయన పేర్కొన్నారు.ఇకపై జియాగూడ డివిజన్ బస్తీలు,కాలనీలు సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు.అలాగే బస్తీలు,కాలనీల ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా శుభ్రతకు సహకరించాలని కోరారు.

# రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ సందడి..





**రామాయంపేట,ఆగస్టు25 (సూర్యరేఖ)** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు.కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులను స్వాగతించేందుకు సీనియర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంగా మారింది.కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నృత్యాలు, పాటలు,నాటికలు వినోదాత్మక ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.ఫ్రెషర్స్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లేశం మాట్లాడుతూ..."కళాశాలలో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యతో పాటు సామాజిక సేవా భావనను పెంపొందించుకోవాలని" సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడుతూ..ఫ్రెషర్స్ పార్టీ విద్యార్థుల మధ్య ఆత్మీయత పెంపొందించేందుకు, ప్రతిభ ప్రదర్శనకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్లు ఫ్రెషర్స్ విద్యార్థులకు పుస్తకాలు బహుమతులుగా అందజేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు ఆనందంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

# కోనాపూర్‌లో యూరియా లభ్యం లేక రైతుల రోడ్డుపై ధర్నా..




**రామాయంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని కోనాపూర్ గ్రామంలో యూరియా లభ్యం కాక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం ఉదయం గ్రామంలోని వందలాది మంది రైతులు కలిసి గ్రామ ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా ఆగిపోయి ట్రాక్టర్లు,ఆటోలు, బస్సులు,ద్విచక్ర వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి.ఆకస్మికంగా ఏర్పడిన ఈ పరిస్థితితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...వర్షాకాలంలో పంటల సాగు ఉధృతంగా సాగుతున్న తరుణంలో యూరియా అందకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని పంటలపై పెట్టిన ఖర్చు వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వారం రోజులుగా యూరియా కోసం సహకార సంఘం మార్కెట్ యార్డ్ చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఒక్క బస్తా కూడా అందలేదని, ప్రభుత్వం రైతాంగ సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమవుతోంది. రైతులకు ఎరువులు అందించడంలో విఫలమవుతుందన్నారు.ఈ పరిస్థితి కొనసాగితే పంటలన్నీ నాశనం అవుతాయని,మా జీవితాలు ప్రమాదంలో పడతాయి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ధర్నా విషయం తెలిసి పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు.అధికారులు త్వరలోనే యూరియా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. అయితే హామీలు కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే మరింత తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# రామాయంపేటలో మట్టి వి నాయక విగ్రహాల పంపిణీ..

**రామాయంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది.జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన 400 మట్టి వినాయక విగ్రహాలను మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ఎం.దేవేందర్ పంపిణీ చేశారు.ప్రజలు పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా మట్టి విగ్రహాలను అందజేస్తోందని కమిషనర్ తెలిపారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం పెరుగుతుందని, మట్టి విగ్రహాల వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.తదనంతరం మిగిలిన విగ్రహాలను మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులకు వార్డు అధికారులు, మహిళా రిసోర్స్ పర్సన్‌ల సమక్షంలో పంపిణీ పూర్తి చేశారు.ప్రజలు అధిక సంఖ్యలో మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతపూర్ ఘటనలో గాయపడ్డ వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే

కోటి రూపాయల నగదు,ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలలి..

బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,ఆగస్టు25(సూర్యరేఖ)** రామంతాపూర్ కరెంట్ షాక్ ఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో బాధితులకు న్యాయం చేయాలంటూ ఉస్మానియా యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం కలిసి కోరారు.గోకుల్ నగర్ లో శ్రీకృష్ణ శోభాయాత్రలో విద్యుత్ షాక్ తో 5 గురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే తెలిపారు.మృతులు రాజేంద్రరెడ్డి,వికాస్,శ్రీకృష్ణ, శ్రీకాంత్,సురేష్ యాదవ్,లకు కోటి రూపాయల నగదు సహాయం అందజేయాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.అలాగే గాయపడ్డ వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన అన్నారు.వారు కోలుకునే వరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు.వారికి అన్ని విధాలా అండగా ఉంటాను అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది బిజెపి నాయకురాలు నల్లుల సంగీత పుట్టినరోజు సందర్భంగా ఓపెన్ బాక్స్ సేవా కార్యక్రమం.




**బెల్లంపల్లి,ఆగస్టు25 (సూర్యరేఖ)** బెల్లంపల్లి నల్లుల సంగీత పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా ఓపెన్ బాక్స్ ఏర్పాటు చేశారు.వాడని చీరలు డ్రెస్సులు,గంజీలు వంటి వస్త్రాలను ఎవరు కావాలనుకున్నా ఈ బాక్స్‌లో ఉంచవచ్చు.అలాగే, అవసరమైన వారు తమకు నచ్చిన వస్తువులను స్వేచ్ఛగా తీసుకెళ్లవచ్చు..ఈ సందర్భంలో నల్లుల సంగీత మాట్లాడుతూ... మన ఇంట్లో వాడని వస్త్రాలు చాలానే ఉంటాయి.వాటిని ఇలా పంచుకుంటే అవి అవసరమైన వారికి ఉపయోగపడతాయి.ఒకరి సహాయం మరొకరికి ఆనందాన్ని ఇస్తుంది.ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.ఓపెన్ బాక్స్ లక్ష్యం వాడని వస్తువులను పంచుకోవడం అవసరమైన వారికి సహాయం చేయడం సమాజంలో సహకార భావన పెంచడం ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది. ప్రజలు ముందుకొచ్చి వాడని వస్తువులు బాక్స్‌లో ఉంచుతూ,తోటి వారికీ సహకరించడం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో రోబోటిక్స్ శిక్షణ..




**నారాయణపేట,ఆగస్టు25(సూర్యరేఖ)**సోహం అకాడమీఆధ్వర్యంలో స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో రోబోటిక్స్ శిక్షణ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం69 మంది విద్యార్థులు (51బాలికలు18 బాలురు) పాల్గొన్నారు.వీరికి రోబో టిక్స్ ప్రాథమిక సూత్రాలు, హార్డ్వేర్ అంశాలు,ప్రాజెక్ట్ డిజైన్ నిర్మాణం వంటి కీలక అంశాల్లో శిక్షణ ఇవ్వబడింది.ఈ శిక్షణ కార్యక్రమంస్ఫూర్తి డిగ్రీ కాలేజీ –సోహం అకాడమీ మధ్య కొనసాగుతున్న సహకారం ఫలితంగా జరిగింది.గతంలో కాలేజీ విద్యార్థులు తమకు నేర్పిన రోబోటిక్స్ పరిజ్ఞానాన్ని పాఠశాల విద్యార్థులకు బోధించడం ద్వారా స్ఫూర్తి దాయక పాత్ర పోషించగా,ఈ ఏడాది అదే ఉత్సాహంతో నారాయణపేట జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఈవిధంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని బలోపేతం చేసుకుంటూనే పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అందించేందుకు వేదిక అవుతున్నారు.ఈ కార్యక్రమానికి ఏఎండి సంస్థ స్పాన్సర్ గా మద్దతు అందించింది.తెలంగాణ రాష్ట్రాన్ని రోబోటిక్స్ విద్యలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సోహం అకాడమీ కీలక పాత్ర పోషిస్తోంది.



# రామాయంపేట మూడవ వార్డులో మురుగు సమస్యతో ప్రజల అవస్థలు





**రామాయంపేట,ఆగస్టు25 (సూర్యరేఖ)** రామాయంపేట పట్టణ మూడవ వార్డులోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి శారద ఫంక్షన్ హాల్ వరకు మురుగు నీరు పారడానికి తగిన మోరీలు,సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గతంలో కొద్ది ఇండ్లు మాత్రమే ఉండడంతో చిన్న చిన్న మోరీలు నిర్మించగా ప్రస్తుతం ఈ ప్రాంతంలో గృహ నిర్మాణాలు భారీగా పెరగడంతో పాత మోరీలు సరిపోవడం లేదు.దీంతో మురికి నీరు వీధుల్లో నిల్వ అవుతూ దోమల వృద్ధి,దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.అదనంగా రాత్రిపూట లైట్లు లేకపోవడం,చెత్త బండి ప్రతి రోజు రాకపోవడం వల్ల చెత్త పేరుకుపోతూ సమస్య మరింత తీవ్రంగా మారింది.ఈ పరిస్థితిని తక్షణమే అధికారులు గమనించి మురుగు నీటి పారుదల సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో హస్నోద్దీన్, జమీర్ సల్మాన్ ఆరిఫ్ సయ్యద్ మొయిన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ డివిజన్లో బీజేపీలోకి భారీగా చేరికలు..

**ఉప్పల్,ఆగస్టు25 (సూర్యరేఖ)** భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు ఆకర్షితులై సోమవారం ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మార్నేని ఫణిందర్ ఆధ్వర్యంలో న్యూశాంతినగర్, సత్యనగర్ గాంధీ నగర్,లకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వీరికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలోకి చేరిన వారు మొగిలిపాక అరుణ్,అనబోయిన రాజేందర్ సేనిగారం అభిరాం,పుట్టల రవితేజ,అనబోయిన సాయి నాగరాజ్ వారి అనుచరులు 54 మంది యువకులు భారతీయ జనతా పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి, సీనియర్ నాయకులు షామీర్ పేట ధర్మారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు ముదిరాజ్ ఉపాధ్యాక్షులు భవిష్ ప్రసాద్ సీనియర్ నాయకులు జూలూరి శ్రీధర్ గుప్తా డివిజన్ కోశాధికారి దువ్వాల రమేశ్ అంజిరెడ్డి ఆడెపు రమేష్ వెంకట్ నవీన్ జైరాం నిశాంత్ ఉదయ్, వినయ్,తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో జానపద గీతం చిత్రీకరణ..




**రామాయంపేట,ఆగస్టు25 (సూర్యరేఖ)** జానపద గీతాలపై ప్రజల ఆదరణ పెరుగుతోందని రచయిత నాగం పరుశురాం పేర్కొన్నారు.ఈ క్రమంలో రామాయంపేట పరిసర ప్రాంతాల్లో ఓ కొత్త జానపద గీతాన్ని చిత్రీకరించారు.గ్రామీణ జీవన శైలిని ప్రతిబింబించేలా,పల్లె వాతావరణాన్ని అచ్చంగా చూపే విధంగా ఈ గీతం తెరకెక్కించబడింది.రచయిత పరుశురాం మాట్లాడుతూ…"పల్లె ప్రజల అనుభవాలకు అనుగుణంగా,వారికి దగ్గరగా ఉండే భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పాటను తీర్చిదిద్దాం. ఇందులో భర్త కోసం భార్య పడే ఆవేదనను సున్నితంగా చూపించాం "అని తెలిపారు.ఈ చిత్రీకరణలో కెమెరామెన్ శివ వెలుపుల తనదైన శైలిలో విజువల్స్‌ను అందించారు.హీరోయిన్ లాస్య,హీరో సురేష్ ప్రధాన పాత్రల్లో నటించారు. స్థానికంగా చిత్రీకరించిన ఈ గీతం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.పల్లె వాతావరణం సంప్రదాయాలు, భావోద్వేగాలకు దగ్గరగా ఉండే ఈ జానపద గీతం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# క్రీడల వల్ల,మానసిక ఆనందంతోపాటు శారీరక ఎదుగుదల

**రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువ జనసర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**





**నారాయణ పేట,ఆగస్టు25(సూర్యరేఖ)** సోమవారం జాతీయ క్రీడాదినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 23 నుండి 31వరకు నిర్వహించు క్రీడల సందర్భంగా మక్తల్ స్థానిక శ్రీనల్లజర్లమ్మ దేవాలయం నుండి స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానం వరకు నిర్వహించిన 2కే రన్ లో మంత్రి హాజరైనారు. ఈ కార్యక్రమంలో డివైయస్ ఓ వెంకటేష్, క్రీడాకారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డిని పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి దంపతులు



**ఉప్పల్,ఆగస్టు25(సూర్యరేఖ)** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తండ్రి చంద్రారెడ్డి ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డిలు సోమవారం సూభాష్ రెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బోపన్నపల్లి సుధాకర్ రెడ్డి,కంది ఆగి రెడ్డి,ఆకారపు అరుణ్,తెల్కల మోహన్ రెడ్డి, రమేష్ నాయక్ సల్ల ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత..

**జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్.**




**నారాయణపేట,ఆగస్టు25 (సూర్యరేఖ)** బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు.మహిళాభివృద్ధి,శిశు సంక్షేమశాఖ-జిల్లామహిళా సాధికారత కేంద్రం(డిహెచ్ ఈడబ్ల్యు)ఆధ్వర్యంలో జిల్లా అధికారు లతో నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్,జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్,జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను,ట్రైనింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ విడుదల చేశారు.బాలికలనురక్షిద్దాం-బాలికలను చదివిద్దాం, అనే నినాదంతో బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ,లింగ సమానత్వం బాల్యవివాహాల నిర్మూలనకు బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)సంచిత్ గంగ్వార్,జిల్లా అద నపు కలెక్టర్(రెవెన్యూ)శ్రీను,ట్రై నింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్,మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు శ్రీలత, కరిష్మ,సాయి,నర్సింహులు అనిత నరసింహ లక్ష్మీకాంత్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం..

**టియుడబ్ల్యూజే ఐజేయుజిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి..**




**నిజాంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని టియుడబ్ల్యుజే ఐజేయు జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… నిజాంపేట మండలానికి సంబంధించి గత కొద్ది రోజుల నుండి జర్నలిస్టులకు స్థలాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.టియుడబ్ల్యూజేఐజేయు సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ డిజి శర్మ,రాష్ట్ర సోషల్ మీడియా మిన్పూర్ శ్రీనివాస్, ఐజేయు సభ్యులు అశోక్ బొందుగుల నాగరాజు, నిజాంపేట జర్నలిస్టులు ఎండీ. అజ్గర్ జీడి. చంద్రకాంత్ గౌడ్,నవీన్ రెడ్డి,సిద్ధ రాములు, భైరవరెడ్డి బాలరాజ్ శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# నల్ల చెరువు కొలనును వెంటనే అందుబాటులోకి తేవాలి





## కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,ఆగస్టు25 (సూర్యరేఖ)**ఉప్పల్ నల్ల చెరువు సమీపంలోని కొలనును వెంటనే అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.కొలనును శుభ్రం చేయడంతో పాటు కొత్త నీటితో నింపాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేలా సౌకర్యాలను కల్పించాలన్నారు. సోమవారం ఉప్పల్ కార్పొరేటర్ రజితరెడ్డి,పరమేశ్వర్ రెడ్డి,లు మున్సిపల్ అధికా రులతో కలిసి కొలనును సందర్శించి చేపట్టాల్సిన పనులను గురించి సూచించారు.ఈ కార్యక్రమంలో డి.ఈ. వెన్నెలగౌడ్ ఏ.ఈ.రాజ్ కుమార్, మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ట్రాఫిక్ సిఐ నాగరాజు శానిటేషన్ డి.ఈ.చందన ఈగ ఆంజనేయులు ముదిరాజ్ తెల్కల మెహన్‌రెడ్డి, లింగంపల్లి రామ కృష్ణ,సల్లా ప్రభాకర్ రెడ్డి,తుమ్మల దేవి రెడ్డి,సుంకు శేఖర్ రెడ్డి,జనగాం రామకృష్ణ బుసం రఘునాథ్ రెడ్డి,గొరిగె మహేష్,మంద మురళీకృష్ణ రెడ్డి అలుగుల అనీల్ కుమార్,అల్వాలా భాస్కర్ వర్కల మధన్ గౌడ్,తోకట రాజు,బకారం అరుణ్, కాటేపల్లి విజయ్ గుప్తా,సతీష్ గౌడ్, నాగూర్ బాషా,చింతకింది శ్రీనివాస్ మల్లికార్జున ప్రశాంత్ రెడ్డి,బట్కర్ కుమార్,రంగుల శేఖర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ నేరం కఠిన చర్యలు తప్పవు..






**బెల్లంపల్లి,ఆగస్టు25(సూర్యరేఖ)**
బెల్లంపల్లి,విద్యార్థులు ఒకరిపై ఒకరు వేధింపులు చేయడం,అవమానించడం ర్యాగింగ్ కిందకే వస్తుందని బెల్లంపల్లి 1 టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.ర్యాగింగ్ నేరమని,ఎవరైనా పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యాసంస్థల నుండి తొలగింపు వంటి కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ర్యాగింగ్ అంటే ఏమిటి విద్యార్థులను అవమానించడం,వేధించడం, అసభ్య ప్రవర్తన చేయడం,ఇది మన సంస్కృతికి విరుద్ధమైన చెడు ఆచారం. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్య,ర్యాగింగ్ చేస్తే ఎదురయ్యే పరిణామాలు విద్యాసంస్థల నుండి సస్పెన్షన్ లేదా శాశ్వత తొలగింపు క్రిమినల్ కేసులు,జైలుశిక్ష అవకాశం భవిష్యత్తు విద్య,ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం..

**విద్యాసంస్థలకు సూచనలు..**
యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి క్యాంపస్‌లో 24 గంటల హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంచాలి..అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించాలి.

**ఫిర్యాదు చేయడానికి..**
డయల్ 100 హెడ్ కాన్స్టేబుల్ స్వప్న: 8712580662,ఎస్.ఐ హైమ8712581092, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ 8712656559,

**సమన్వయం అవసరం..**
ర్యాగింగ్ నిర్మూలనలో పోలీసులు,విద్యాసంస్థలు, అధ్యాపకులు,విద్యార్థులు కలిసి పని చేయాలని పోలీసులు పిలుపునిచ్చారు.1997 నుంచే ర్యాగింగ్ నిషేధం అమల్లో ఉంది.ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాదు సమాజానికీ హానికరం.బెల్లంపల్లి 1 టౌన్ పోలీసులు సదా మీ సేవలో ఉంటారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి





## కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్


**ఉప్పల్,ఆగస్టు25(సూర్యరేఖ)** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్,ను తన కార్యాలయంలో కలిసి చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. చిల్కానగర్ డివిజన్ లోని శివాలయం వెనకాల ఇమామ్ గల్లీలో స్ట్రాంవాటర్ డ్రైన్స్,సిసి రోడ్లు మరల మైసమ్మ ఆలయం పక్క వీధిలో సుభద్ర సత్యవతి గల్లీలో స్ట్రాంవాటర్ డ్రైన్, సిసి రోడ్ల కొరకు,ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 2, సిసి రోడ్లకు కళ్యాణపురి మర్రిచెట్టు దగ్గర నుండి కళ్యాణపురి పార్క్ వరకు సిసి రోడ్డు కొరకు,బీరప్ప గడ్డ రామాలయం ప్రాంతం,లైబ్రరీ ఎదురు గల్లీలో అదేవిధంగా లైబ్రరీ వెనకాల అన్నపూర్ణ కాలనీలో సిసి రోడ్లు కొరకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. అదేవిధంగా డివిజన్లోని ఐదు ప్రాంతాలలో ముఖ్యంగా పార్కులలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేయాలని,విషాతాత్ ఎన్క్లేవ్,అజ్మత్ నగర్ నుండి మల్లికార్జుననగర్ వైపు దారిలో ఉన్న ఇరిగేషన్ నాలాపై కల్వర్టుకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది.జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పనులకు వీలైనంత త్వరలో నిధులు కేటాయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## కలెక్టరేట్ లో మట్టి గణపతుల పంపిణీ..



**నారాయణపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ప్రజలకు,అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితోతయారుచే సిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు.పర్యావ రణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలన్నారు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్,ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జలవనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతి ష్టించి,పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వర్,అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్.శ్రీను,పి.భాస్కర్ రెడ్డి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ బోర్డు ఆఫీస్ హైదరాబాద్ వారు వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కార్డు అర్హులకు ఉచిత వైద్య పరీక్షలు




**నిజాంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** మండల కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణలో లేబర్ కార్డు పొందిన అర్హులకు సీఎస్సీ మెదక్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....లేబర్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికి సీఎస్సీ సంస్థ ఆధ్వర్యంలో 12 వేల ఉచిత టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు.లేబర్ కార్డు పొందిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో 30 మందికి టెస్టులు నిర్వహించామన్నారు .ఈ కార్యక్రమంలో దేవరాజ్, ప్రమోద్,భరత సింహారెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.


## మండల సమైక్య ఆధ్వర్యంలో మహాసభ సమావేశం..




**నిజాంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)**మండల కేంద్రంలో సోమవారం మండల సమైక్య వివోఏల ఆధ్వర్యంలో గ్రామ మహిళలచే గ్రామీణ పేద నిర్మూలన మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-25కి గాను మహిళా గ్రూపులకు అందించిన లావాదేవీలను వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పావుల వడ్డీ రుణాలను అందించడం జరుగుతుందని ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళసంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఏపీఎం స్వరూప,వివో ఏలు లక్ష్మి,లలిత,రేణుక, కంప్యూటర్ ఆపరేటర్ స్వామి,మహిళా సంఘాలు,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

భాజపా జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు



**కామారెడ్డి,ఆగస్టు25(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు మాట్లాడుతూ...జిల్లాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు శ్రీనివాస్, నరేందర్,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ దార్శనికత, స్థిరాభివృద్ధి లక్ష్యాలపై స్వల్పకాల సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం





**ఉప్పల్,ఆగస్టు25 (సూర్యరేఖ)** జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంయుక్త నిర్వహణలో గాంధీ దార్శనికత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై స్వల్పకాల సర్టిఫికేట్ కోర్సు ఘనంగా ప్రారంభమైంది.పదిహేను పనిదినాలలో 30 గంటల తరగతులతో ఆగస్టు 25 నుండి-సెప్టెంబర్18,2025 వరకు ఈ కోర్సు జరగనుంది.ప్రిన్సిపాల్ డా.కె. విజయ్ కుమార్ సభాధ్యక్షత వహించగా కోర్సు సమన్వయ కర్తగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి జల్దా.విశ్వనాథ్ కుమార్ వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకోసం గాంధేయవాదం ఉపకరణం అన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంకి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాంధీ పరిశోధకులు,రచయిత,ప్రసార భారతి రిటైర్డ్ డైరెక్టర్ డా.నాగసూరి వేణుగోపాల్ పాల్గొని ప్రసంగించారు.గాంధీయే మార్గమనీ నవతరానికి ఆదర్శప్రాయుడనీ,సామాజిక మహాపాపాల నిర్మూలన కోసం,నిర్మాణాత్మక కార్యాచరణకోసం యువత ముందువరసలో ఉండాలని కోరారు. పర్యావరణహితమైన సాదాసీదా జీవనవిధానాలు అవలంబించాలని వారు కోరారు.ఆన్లైన్ లోనూ కోర్సుని ప్రవేశ పెట్టాలని కోరారు.కోర్సు సమన్వయ కర్త జల్దా విశ్వనాథ్ కుమార్ మాట్లడుతూ...తాను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ పొంది ఉండటం, గాంధీ శతజయంతి సందర్భంగా ప్రారంభించబడిన ఎన్ఎస్ఎస్ లో కార్యక్రమ అధికారిగా ఉండటం వలన ఈ అంశంపై జాతీయ స్థాయి సదస్సునీ సర్టిఫికేట్ కోర్స్ ని చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు గాంధీ పుస్తక ప్రదర్శన,గాంధీ చిత్ర ప్రదర్శన,విద్యార్థుల గాంధీ వేషధారణ జరిగింది. చిత్రప్రదర్శనని,పుస్తక ప్రదర్శనని ఉప్పల్ మండల విద్యాధికారి,ఉప్పల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి సిబ్బంది విద్యార్థులు కూడా సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్ డా.జి.తిరుపతయ్య,డా.ఎన్ రాజశ్రీ, డా.సిహెచ్ సత్యనారాయణ,అకడమిక్ కోఆర్డినేటర్ కె.గీత డా.ఎస్ యమునారాణి డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్ చంద్రసాగర్ డా.పి.వెంకటేశ్వర్లు స్రవంతి, విజయలక్ష్మి,ఎల్ అనుష,తదితరులు పాల్గొన్నారు.

# కలుపు కట్టడి చేద్దాం..

**కలుపు మందుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి..**

**అధిక మోతాదులో వాడితే పంటలకు ముప్పు..**

**వానాకాలం సీజన్లో ఊపందుకున్న పంటల సాగు..**

**కలుపు నివారణకు వ్యవసాయాధికారుల పలు సూచనలు..**





**మాసాయిపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పాటు మండలంలోని చెరువులు,కుంటలు నిండడంతో సాగు సందడి కన్పిస్తోంది. బోర్లు,బావుల కింద నాట్లు ముగియగా చెరువులు,కుంటల కింద ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి.పంటల సాగులో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు మొక్కల నివారణ ఎంత తొలగించినప్పటికీ ప్రతి 15 నుంచి 20 రోజుల్లో పంట కంటే ఎక్కువగా కలుపు పెరుగుతుంది.నేలసారాన్ని పంట కంటే ఎక్కువగా ఈ కలుపు మొక్కలే పీల్చేస్థాయి.అందుకే కలుపును సమూలంగా నివారించేందుకు దశాబ్దాల క్రితమే రసాయన మందులు వచ్చాయి. అయితే వీటిని ఎంత మేరకు వినియోగించాలి, ఎలా వాడాలి అనే విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉంటే మేలు. కలుపు మందులను ఎంత మోతాదులో వాడాలో,ఏ కాలంలో పిచికారీ చేయాలో తెలియక రైతులు నష్టపోతున్నారు.వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ రైతులు కలుపు నివారణ మందులను వినియోగించాలి.వీటిని నిర్ణీత పరిమాణం మేరకే వాడాలి. మోతాదు మించితే పంట మొక్కలకు,విత్తనాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.నేల సైతం తన సహజత్వాన్ని కోల్పోతుంది.వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు కలుపు మందులు వాడాలి.జాగ్రత్తలు తీసుకొని మందులు పిచికారీ చేయాలి.

**వ్యవసాయ అధికారులు రైతులకు ఇచ్చిన పలు జాగ్రత్తలు..**

పురుగు మందులు,కలుపు మందులు వేర్వేరుగా నిల్వ చేసుకోవాలి.కలుపు మందులు వాడేటప్పుడు అంటే పిచికారీ చేసేటప్పుడు ఇతర రైతుల పంట మొక్కలపై పడకుండా చూసుకోవాలి.

-ఈ మందు మనుషులు,పశువులు,పక్షులు తినే ఆహార పదార్థాలపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని పిచికారీ చేయాలి.

-వరిలో కలుపు మొక్కల నివారణకు వరి నాటిన 2 నుంచి 5 రోజుల వ్యవధిలో బ్యూటాక్లోర్ అనే మందు ఒక ఎకరానికి లీటరు గాని లీటరున్నర లేదా అనిలోఫాస్ మందు 500 నుంచి 600 మిల్లీలీటర్లు లేదా ప్రిటిలాక్లోర్ మందు 500 మిల్లీ లీటర్లు ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

-వరి నాటిన 20నుంచి25 రోజుల తర్వాత పొలంలో ఇంకా వెడల్పాకు గడ్డి,మొండి జాతి గడ్డి వంటి కలుపు మొక్కలు గుర్తిస్తే 2,4డీ సోడియం సాల్ట్ పొడి మందును ఎకరానికి 600 నుంచి 800 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి.లేదా ఒక ఎకరానికి బిస్పైరిక్ సోడియం అనే మందును100 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి.

-కొన్ని రకాల కలుపు మందులు కలుపు మొక్కలతో పాటు పంటను కూడా ఒకేసారి నిర్మూలిస్తాం.

-మొండిజాతి కలుపు మొక్కలు గర్క,తుంగ,దర్భ మొక్కలపై గ్లైపోసిట్ మందు పిచికారీ చేయాలి.



కలుపు మొక్కలు నాలుగు ఆకుల నుంచి ఆరు ఆకుల దశలో మందు కొట్టాలి.నీటిలో కరిగే పొడి కలుపు మందులను ఇసుకలో గాని యూరియాలో గాని కలిపి చల్లొద్దు..

-హ్యాండ్ స్ప్రేయర్లతోనే పిచికారీ చేయాలి. పవర్ స్ప్రేలు వాడొద్దు..

-కలుపు నివారణ మందును పంట కాలంలో ఒకసారే పిచికారీ చేయాలి.పొలంలో వెనుకకు నడుస్తూ ముందుకు స్ప్రే చేయాలి.

**వ్యవసాయాధికారుల సూచనల మేరకే కలుపు మందులు వినియోగించాలి..**

**మండల వ్యవసాయ శాఖ అధికారి వేంకట రాజశేఖర్**

వరిలో కలుపు మొక్కల నివారణకు రైతులు వ్యవసాయాధికారులు సూచించిన సిఫారసు మేరకే కలుపు మందులు వినియోగించాలి.ఎక్కువ మోతాదులో వాడితే పంటలకు కూడా నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది.మందులను ఎక్కువగా వాడి పంటను నాశనం చేసుకోవద్దు.కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి..

## వేతనాలు ఇప్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యేను కోరిన ఉద్యోగులు..



**బెల్లంపల్లి,ఆగస్టు25 (సూర్యరేఖ)** 104లో పనిచేస్తున్న ఉద్యోగులు గత ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను పరిష్కరించి, వెంటనే వేతనాలు ఇప్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కోరారు.ఉద్యోగుల తరపున ప్రతినిధులు మాట్లాడుతూ...మా కుటుంబాలు రోజువారీ కష్టాల్లో ఉన్నాయని వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి.మా వేతనాలు విడుదలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేని వేడుకుంటున్నాం అని తెలిపారు.వేతనాల సమస్యను పరిష్కరించకపోతే ఉద్యోగుల జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ,ఎమ్మెల్యే తమకు అండగా నిలుస్తారని నమ్మకం వ్యక్తం చేశారు కార్యక్రమంలో 104 ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియాతో తప్పని తిప్పలు..



**నిజాంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)**మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో సోమవారం యూరియా లోడ్ లారీ రావడంతో సొసైటీ వద్ద రైతులు కిక్కిరిసి పోయారు.సొసైటీ నిర్వాహకులు పోలీసుల ఆధ్వర్యంలో రైతుల నుండి పట్టా పాసు బుక్,ఆధార్ కార్డు జిరాక్స్,తీసుకొని రైతుకు రెండు యూరియా సంచులను అందించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం రైతులకు యూరియా అందించే విషయంలో దృష్టి సారించిందన్నారు.ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ అధికారులు మాత్రం యూరియా కొరత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని, యూరియా కోసం క్యూ లైన్ లో నిలబడ్డ రైతులు ప్రభుత్వానికి కండ్లకు కనబడడం లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.యూరియా కోసం సొసైటీ వద్ద కాసేపు గందరగోళం ఏర్పడిన చివరకు ఒక్కొక్క రైతుకు రెండు సంచుల యూరియా బస్తాలను అందించిన లాభం లేకుండా పోయింది.వరి పంట వేసి యూరియా దొరకగా వేసిన పంట నాశనం చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించేలా కృషి చేయాలన్నారు.

## మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడదాం..

**దేవర వంశీ**



**నాంపల్లి,హైద్రాబాద్,ఆగస్టు 25 (సూర్యరేఖ)**వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని గుడిమల్కాపూర్ డివిజన్ లోని శారధనగర్ సర్కిల్ వద్ద గల భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణి నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ పాల్గొని మట్టి వినాయక విగ్రహాల పంపిణి నిర్వహించారు.ఈ సందర్భంగా దేవర వంశీ మాట్లాడుతూ...మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడదాం అని పిలుపునిచ్చారు.మట్టితో చేసిన గణపతి విగ్రహాలు 100శాతం బయోడిగ్రేడబుల్ పదార్థాలతో తయారు చేయబడతాయనీ నీటిలో సులభంగా కరిగిపోతాయన్నారు.ప్రకృతి శక్తులను ఆరాధించడం భారతీయ సంస్కృతిలో భాగంగా ఉందని,మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించవని సూచించారు.ఈ కార్యక్రమంలో నేతలు జొన్నకూటి మధుసూదన్,రాధాకృష్ణ, నాగరాజ్ శివరాజ్,విజయేందర్,శ్రీకాంత్ సాగర్ యాదగిరి,సందేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దామర్ గిద్ద ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్





**నారాయణపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైరిస్క్, నాన్ ప్రైమీ,ప్రైమి,ప్రసవాల వివరాలను అడిగితెలుసుకున్నారు.అలాగే ఈడీడీ క్యాలెండర్ లో పూర్తి వివరాలు వాటి సంఖ్యలతో సహా నమోదు చేయాలన్నారు.ఆస్పత్రిలో జరిగే ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు.ఆస్పత్రిలో రోజువారి ఓ.పీ.వివరాలను అడిగి ఎక్కువగా ఎలాంటి రుగ్మతలతో వస్తున్నారని డాక్టర్ ను ప్రశ్నించగా రోజూ100 నుంచి120 మంది వివిధ రకాల రుగ్మతలతో వస్తారని కలెక్టర్ కు తెలిపారు.ప్రస్తుతం ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతం గా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆ స్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడి,వైద్య సేవల గురించి ఆరాతీశారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకుని ఆసుపత్రి బయట బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ వృద్ధు రాలినిగమనించిన కలెక్టర్ ఆ వృద్ధురాలికి ఎలాంటి వైద్య పరీక్షలు చేశారని లోపల ఉన్న వైద్యురాలిని బయటికి పిలిచి మరీ వాకబు చేశారు.వృద్ధురాలికి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుపతయ్య ఎంపీడీవో సాయిలక్ష్మి డాక్టర్ ఐశ్వర్య, తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం





**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల**

**ఉప్పల్,ఆగస్టు25(సూర్యరేఖ)** అనారోగ్యంతో హాస్పిటల్లో అడ్మిట్ అయిన చిల్కానగర్ నివాసి ఈదనూరు రవీందర్ గౌడ్,కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో హాస్పిటల్ కి ఆయన ఖర్చులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కుని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్,బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి రవీందర్ గౌడ్ ఇంటికి వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకొని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేయడం జరిగింది. అనంతరం రవీందర్ గౌడ్ కి ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తనను సంప్రదించాలని వారికి ధైర్యం చెబుతూ అభయం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి,కోకొండ జగన్,చర్యల శ్రీనివాస్,అశోక్ చారి,హమీద్,ఎండి షఫీ సకినాల ప్రసాద్,నర్సింగ్ నేత కుమార్ శ్యామ్ బాలు,సకినాల చందు హమీద్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా మారం పవిత్ర అభినందనీయం..

**బమండ్ల అనిత**



**నాంపల్లి, హైద్రాబాద్, ఆగస్టు25 (సూర్యరేఖ)** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయు రాలిగా సేవలందిస్తున్న మారం పవిత్ర ప్రతిష్టాత్మకమైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారానికి ఎంపికకావడం అభినందనీయ మని గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని ఓప్రభుత్వ పాఠశాల కాంటాక్ట్ ఉపాధ్యాయిని బమండ్ల అనిత కొనియాడారు.ఈ సందర్భంగా బమండ్ల అనిత మాట్లాడుతూ...సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న మారం పవిత్ర ప్రతిష్టాత్మకమైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారానికి ఎంపిక కావడం విద్యా రంగంలో తన కృషి,బోధనలో కొత్త పద్ధతుల అమలు,విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ఆమె చూపిన అంకితభావం ఫలితంగా ఈ గుర్తింపు దక్కిందన్నారు.ఆమె సాధనను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారంతో సత్కరించనుందని బమండ్ల అనిత పేర్కొన్నారు.

# లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో హరిణికి ఘనంగా సన్మానం



**మందమర్రి,ఆగస్టు25 (సూర్యరేఖ)** ఈనెల పదవి విరమణ పొందబోతున్న అధికారి సతీమణి, లేడీస్ క్లబ్ మెంబర్ డి హరిణి సత్య నారాయణను లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డైరెక్టర్ (ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ )డి. సత్యనారాయణరావు ఈనెల 31వ తారీకున పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఏరియాలోని లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ జి.స్వరూపరాణి దేవేందర్ అధ్యక్షతన,లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొని ఏరియాలోని ఇల్లందు క్లబ్ లో సోమవారం డి.హరిణి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జి.స్వరూపరాణి దేవేందర్ మాట్లాడుతూ..డైరెక్టర్ (ఈ ఎం) డి.సత్యనారాయణ రావు సింగరేణి సంస్థలో 39 సంవత్సరాల 5 నెలలు సుదీర్ఘ సర్వీసు చేసి సింగరేణి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు ఆగస్టు నెల31వ తారీఖున పదవీ విరమణ పొందడం జరుగుతుందని,అందులో భాగంగా నేడు మందమర్రి ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డి.హరిణి సత్యనారాయణకు ఆత్మీయ వీడుకోలు చేయడం అభినందించదగిన విషయమని అన్నారు.పదవి విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ,డి.హరిణి సత్యనారాయణ,లు మాట్లాడుతూ... సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేసే అత్యున్నత హోదా అయిన డైరెక్టర్ గా అవకాశం రావడం చాలా సంతోషకరమైన విషయమని దీనికి సహకరించిన సంస్థ చైర్మన్ బలరాం సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలను తెలియజేశారు.అలాగే మందమర్రి లేడీస్ క్లబ్ వారిచే ఈ ఘన సన్మానం అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ మణి, ట్రెజరర్ కవిత,జాయింట్ సెక్రటరీ సుజాత కమిటీ మెంబర్స్ సుల్తానా శ్రీలత రాధిక లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి..

**8మంది అరెస్ట్**




**నిజాంపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** మండలం నగరం తాండ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు నిజాంపేట ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకోని వారి నుండి 5 బైకులు 5సెల్ ఫోన్లు 15,040 రూపాయలు సీజ్ చేయడం జరిగింది.నిందితుల వివరాలు పల్లపు శ్రీనివాస్,కొమ్మాట బాబు,పల్లపు మహేందర్,గూగుల్ గోపి,గుర్రాల బాలరాజు,కొమ్మాట వెంకటేష్,పల్లపు లక్ష్మణ్,గుగులోతు రవి,లపై కేసు నమోదు చేయడం జరిగింది.ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం..






**నారాయణపేట,ఆగస్టు25 (సూర్యరేఖ)** విశ్వబంధుత్వది నోత్సవం రాజయోగిని దాది ప్రకాశమణి 18వ,పుణ్యస్మృతి దినం సందర్భంగా దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరంలో భాగంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం జిల్లా నారాయణపేట స్థానిక కేంద్రంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆదిత్యగౌడ్,ఆత్మరామ్,లయన్స్ క్లబ్ సభ్యులు, భీష్మరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులైన డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి వారి మిత్రబృందంతో ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.స్థానిక సేవ కేంద్రం ఇన్చార్జి బ్రహ్మకుమారి జయమరికల్ సేవా కేంద్రని ర్వాహకులు బ్రహ్మకుమారి సునీత, బి.కే.అనసూయ, బ్రహ్మకుమారికు మారులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ కు హైలెవెల్ వంతెన నిర్మించాలి..

**తుడుందెబ్బ దీక్షకు మద్దతు..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి**





**బెల్లంపల్లి,ఆగస్టు25 (సూర్యరేఖ)** తాండూరు మండలంలోని నర్సాపూర్ గిరిజన గ్రామానికి హైలెవెల్ వంతెన నిర్మించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు.తహసీల్దార్ కార్యాలయం ముందు తుడుండెబ్బ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరహార దీక్షకు బిజెపి నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ...వర్షం పడితే గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచి పోతుందన్నారు. నర్సాపూర్ గ్రామానికి వెళ్లడానికి భీమన్న వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలి అని అన్నారు.నర్సాపూర్ నుండి బెజ్జాల వరకు బిటి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ హైదరాబాద్ లో ఉంటూ ప్రజల సమస్యలు గాలికి వదిలేశారని విమర్శించారు.ప్రజల సమస్యలు పట్టక పోతే పుట్టగతులుండవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,మండల అధ్యక్షులు భరత్ కుమార్,జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు,సీనియర్ నాయకులు శేషగిరి చిరంజీవి,మల్లేష్,పుట్ట కుమార్, సురేష్,నాగభూషణం,విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేయాలి






**పత్తి కుంటలో నాలుగు,పల్లె చెరువులో మూడు, మీరాళంలో రెండు క్రేన్ల ఏర్పాటు..**

**రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి**

**రాజేంద్రనగర్,ఆగస్టు25(సూర్యరేఖ)** గణేశ్ ఉత్సవాల్లో అధికారులు,కమిటీ సభ్యులు సమన్వయంగా వ్యవహరిస్తూ ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి అన్నారు.గణేష్ నవరాత్రులు,నిమజ్జన ఏర్పాట్లపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు,రాజేంద్రనగర్ మండల తాహసిల్దార్ బొమ్మ రాములుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు.విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు ఎక్కడా ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు డీసీ సురేందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.గణేశ్ ఉత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలవాలని,ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా జరుపుకోవాలని కోరారు.ప్రజల సంప్రదాయాలకు భంగం కలగకుండా జరుపుకోవాలన్నారు. ఈ సంవత్సరం నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా మూడవ రోజు నుంచి 11వ రోజు వరకు పత్తికుంటలో 4,పల్లె చెరువు 3,మీరాళం చెరువు వద్ద 2 క్రేన్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**విద్యుత్ శాఖ అధికారులు అలర్ట్‌గా ఉండాలి..**

**డీజేలకు అనమతిలేదు..**

కేబుల్ వైర్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు సూచించారు.విగ్రహాల తరలింపులో ఎక్కడా కూడా చెట్ల కొమ్మలు అడ్డు రాకుండా తొలగించాలని,వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని ఆదేశించారు.సర్కిల్ పరిధిలోని రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేస్తామని తెలిపారు.సీఐలు క్యాస్ట్రో నరేందర్, లు మాట్లాడుతూ...గణేశ్ మండపాల ఏర్పాటు, నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.గణేష్ మండపాల వద్ద మద్యం తాగడం,పేకాట ఆడటం అసభ్యకర నృత్యాలు చేయడం నిషేధమన్నారు. నవరాత్రి ఉత్సవాలను సామరస్యంగా జరుపుకోవాలన్నారు.విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలన్నాన్నారు.డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదని తెలిపారు.ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు.ఎలాంటి గొడవలకు తావులేకుండా శోభయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బొమ్మ రాములు,ఈఈ.నరేందర్ గౌడ్, డాక్టర్ రజనీకాంత్,జలమండలి డిప్యూటీ మేనేజర్ జవహర్ అలీ,తదితరులు పాల్గొన్నారు.

**నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి**

**ఉత్సవ కమిటీ సభ్యులు....**

గణేష్ నవరాత్రులు వైభవంగా జరుపుకునేందుకు అధికారులు తగిన ఏర్పాటు చేయాలని ఉత్సవాల కమిటీ నిర్వాహకులు కోరారు.నిమజ్జన స్థలాల వద్ద క్రేన్లు, విద్యుత్‌దీపాలు,గజ ఈతగాళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలను అందుబాటులో ఉంచాలన్నారు. నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద పారిశుద్ధ్యం విద్యుత్ లైట్ లను ఏర్పాటు చేయాలని కోరారు. నిమజ్జనం రోజు దారి పొడవునా భక్తుల సౌకర్యార్థం మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మల్లారెడ్డి,కొమురయ్య,మల్లేష్ యాదవ్,సామ ఇంద్రపాల్ రెడ్డి,నత్తి ధనుంజయ, విజయ్ కుమార్ బాబురావు,జగన్,నవీన్ కుమార్, రగడంపల్లి శ్రవణ్,

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో ఐదు రోబోటిక్ కోర్సులో తక్షణ ప్రవేశాలు

**ఏటీసీ,ఐటిఐ ప్రిన్సిపాల్ రేణుక**

**10వ తరగతి పాసైతే సీటు ఇస్తామంటున్న అధికారులు..**




**రాజేంద్రనగర్,ఆగస్టు25(సూర్యరేఖ)** పాతబస్తీ ప్రభుత్వ ఐటిఐలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా మారో ఐదు రోబోటిక్స్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందడానికి అర్హులని ఆమె చెప్పారు.వివిధ కేటగిరిలలో ఇప్పటికే సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ కాగా,ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు రోబోటిక్స్ విభాగంలో వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్-ఎఫ్ఎం(ఫినిట్ ఎల్మెంట్ మేథడ్) (ఎన్ఎస్క్యూఎఫ్),ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యాక్చరింగ్ టెక్నిషియన్, మ్యాన్ ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్ టెక్నిషియన్,ఆటో బాడి పెయింటింగ్ మెకానిక్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఆటో మెకానిక్ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఆసక్తిగల విద్యార్థులు ఎస్.ఎస్.సి మెమో, టిసి,బదిలీ సర్టిఫికెట్ ఆధార్ కార్డు,ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో నేరుగా జూపార్క్ సమీపంలోని మోచికాలనీ,తాడ్ బన్ లో గల టిటిఐకి వచ్చి సిబ్బంది సహకారంతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్ల ధృవీకరణ అనంతరం అర్హులైన వారికి తక్షణ సీటు కేటాయింపు చేస్తున్నట్లు ఆమె వివరించారు.ఆటో ఎలక్ట్రిషియన్ విభాగంలో 40 సీట్లు,ఆటో పెయింటింగ్ కోర్సులో40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె సోమవారం సాయంత్రం వెల్లడించారు


## కేబుల్ వైర్లను తొలగించాలి..



**మణికొండ మున్సిపల్ కార్యాలయంలో విన్నవించిన బీఆర్ఎస్ నాయకులు**

**మణికొండ,ఆగస్టు25(సూర్యరేఖ)** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనవసరమైన కేబుల్ వైర్లను మున్సిపల్ అధికారుల అనుమతితో తొలగించరా మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్ ప్రశ్నించారు.కేబుల్ వైర్లను తొలగించకుండా వాటిని వదిలేశారని,బాధ్యులకు నోటీసులు ఇచ్చారా అని నిలదీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ వైర్ల వల్ల ప్రతి కాలనీలోని చిన్న పెద్ద రోడ్లన్నీ రహదారి బాటసారులకు వాహనదారులకు వ్యాపారస్తులకు వ్యాపార కూడళ్లకు వస్తూ సామాగ్రి ఖరీదు చేయటానికి వచ్చే ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా ఉందన్నారు.ఈ విషయమై సంబంధిత అధికారులతో వైర్లను తొలగించాలని,ప్రత్యేకించి మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి ప్రజా సౌకర్యార్థం రోడ్లపై ఉన్న కేబుల్ వైర్లను ప్రజల హితం కోరి సంస్థ పనివారితో తొలగింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో సుమన్ కందాడ ప్రవీణ్ కుమార్,సీనియర్ నాయకులు గుట్టమీది నరేందర్ శ్రీధర్,భాను చందర్ సుమనళిని తిరుపతి హుసేన్ శ్రీనివాస్ గోపి,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సోలార్ ప్లాంట్ ను సందర్శించిన డైరెక్టర్ ఈ అండ్ ఎం



**మందమర్రి,ఆగస్టు25(సూర్యరేఖ)**ఏరియాలోని 67.5 ఎండబ్ల్యూ సింగరేణి సంస్థ సోలార్ పవర్ ప్లాంట్ ను డైరెక్టర్ ఈ అండ్ ఎం సోమవారం ప్లాంట్‌లో జరుగుతున్న పనులను సందర్శించి పర్యవేక్షించా రు.అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులతో ప్లాంట్ స్థితి గతులపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మార్కెట్లో పోటీని తట్టుకోవడానికి తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావించి,రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ సోలార్ పవర్ ఉత్పత్తి చేసిన తొలి ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి నిలిచిందన్నారు.అనంతరం సోలార్ ప్లాంట్ లో మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని డైరెక్టర్ ఈ అండ్ ఎం సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్,ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి ఝా,ప్లాంట్ ఇంచార్జి ఆర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 40 ఫిర్యాదులు..



**నారాయణపేట,ఆగస్టు 25 (సూర్యరేఖ)** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 దరఖాస్తులు,ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వర్అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్ శ్రీను,ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమా ర్,ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండ ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చిట్టెం ఫర్నికారెడ్డి



**నారాయణపేట,ఆగస్టు25(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో రూ.26.60 లక్షలతో చేపట్టే గ్రౌండ్ లెవలింగ్/అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి శంకుస్థాపన చేశారు.నిర్మాణ పనులకు సంబంధించిన నిధులను యూనియన్ బ్యాంక్ వారిసౌజన్యంతో సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ... నారాయణపేట క్రీడలకు,క్రీడాకారులకు నిలయమని, ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోతమ క్రీడా ప్రతిభనుచాటా రని తెలిపారు. క్రీడలశాఖ మంత్రిగా మన జిల్లాకు డాక్టర్ వాకిటి శ్రీహరి ఉన్నారని,రాబోయే రోజుల్లో క్రీడలకు మహర్దశ వస్తుందన్నారు.కార్య క్రమంలో అదనపు కలెక్టర్.లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, యూనియ న్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్,పీఆర్ఈ.ఈహీర్యానా యక్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్,డివైఎస్ఓ.వెంకటేష్,పి.డి సాయినాథ్, బాలరాజ్,అక్తర్ పాషా,దత్తురావు,కాంగ్రెస్ పార్టీ నగర ముఖ్యనాయకులు,తదితరులు పాల్గొన్నారు.

**ఖోఖో ఆడిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి..**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మైదానంలో పాఠశాల విద్యార్థినులతో కలిసి ఆటవిడుపుగా సరదాగా కాసేపు ఖో-ఖో ఆట ఆడి విద్యార్థినిలలో ప్రోత్సాహాన్ని నింపారు.ఆటలో క్రీడా స్ఫూర్తిని చాటిన ఎమ్మెల్యే చివరి వరకు అవుట్ కాకపోవడం గమనార్హం.

## నూతన అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. కుశల్కర్



**సిద్దిపేట** : నూతన అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. కుశల్కర్, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. కమిషనర్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందించారు.సిహెచ్. కుశల్కర్, 1995 ఎస్ఐగా పోలీస్ డిపార్ట్మెంట్లో అరంగేట్రం చేసినారు. ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలో పనిచేశారు,2008 సంవత్సరంలో సీఐగా ప్రమోషన్ పొంది ఉమ్మడి నిజాంబాద్, మరియు హైదరాబాద్ సిటీలో పనిచేశారు. 2018 సంవత్సరంలో ఏసిపి గా ప్రమోషన్ పొంది సిసిఎస్ హైదరాబాద్ సిటీ, షాద్ నగర్, మహేశ్వరం ట్రాఫిక్ ఏసిపి గా పనిచేస్తూ అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొందారు.సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ యాదమ్మ, గజ్వేల్ ఏసిపి నరసింహులు, సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, మొగిలి, శ్రీధర్ గౌడ్, ఇన్స్పెక్టర్లు వాసుదేవరావు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, మరియు కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు మరియు పోలీస్ అధికారులు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు.

# ఈ వయస్సులోను నాగార్జున ఇంత బిజీనా.. ఒకవైపు షోస్, మరోవైపు సినిమాలు



కెరీర్‌ని ఎప్పుడు ఎలా మలచుకోవాలో నాగార్జునకి తెలిసినంతగా ఎవరికి తెలియకపోవచ్చు. ఆయన ఫ్లాపులు వచ్చిన అధైర్యపడరు. ఈ వయస్సులోను కూడా ఉత్సాహంగా సినిమాలు, టీవీ షోస్, యాడ్స్‌తో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. ఈ ఏడాది మల్టీ-స్టారర్ ప్రాజెక్టులు, పవర్‌ఫుల్ పాత్రలతో తెరపై ఆకట్టుకుంటూ, వెర్సటైల్ యాక్టింగ్‌తో సత్తా చాటుతున్నారు నాగ్. హీరోగా కాకుండా సపోర్టింగ్ పాత్రలు చేసిన కూడా అవి ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది నాగార్జున కుబేర, కూలీ చిత్రాలతో ప్రేక్షకులని పలకరించగా, కుబేరలో పాజిటివ్ షేడ్స్ ఉన్న దీపక్ పాత్రలో నటించారు. కూలీ లో మాత్రం పవర్ ఫుల్ నెగటివ్ రోల్ సైమన్ గా కనిపించారు. స్టార్డమ్‌ను పక్కన పెట్టి, ఇతర హీరోల సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు చేయడమంటే చిన్న విషయం కాదు. కానీ నాగార్జున ఆ ఛాలెంజ్ స్వీకరించి సత్తా చాటుతున్నారు. ఈ రెండు పాత్రల ద్వారా ఆయనకు టాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీల్లోనూ మార్కెట్ పెరిగింది. ఇప్పుడు నాగార్జున తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవబోయే 100వ సినిమా కోసం సిద్ధమవుతున్నారు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఓ టాక్ షోలో మాట్లాడిన నాగార్జున, తన 100వ సినిమాకు తమిళ డైరెక్టర్ కార్తీక్ ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సినిమా త్వరలోనే పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, ఇది యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కబోతోంది. "కింగ్ 100" అనే టైటిల్ పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. మరోవైపు నాగార్జున బిజీ షెడ్యూల్ ఇక్కడితోనే ఆగలేదు. బిగ్ బాస్ సీజన్ 9 కు కూడా హోస్ట్‌గా కూడా వ్యవహరించనున్నారు. సెప్టెంబర్‌లో ఇది మొదలు కానుంది. ఒకవైపు రియాలిటీ షో షెడ్యూల్, మరోవైపు సినిమా షూటింగ్.. రెండింటినీ సమాంతరంగా నిర్వహించేందుకు నాగార్జున ప్లాన్ చేసుకున్నట్టు తెలుస్తుంది. మొత్తానికి 2025లో నాగ్ బిజీయెస్ట్ స్టార్‌గా మారారు. నాగార్జున తన 100వ సినిమాలో చాలా డైనమిక్ పాత్రలో కనిపించనున్నారట. ఎమోషన్స్, యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అన్నీ కలగలిసిన ఈ చిత్రం ఆయన కెరీర్‌కు మైల్ స్టోన్‌గా మారాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# బాలీవుడ్‌లో చాలా తక్కువ పారితోషికం.. పెద్ద సినిమాల్లో ఛాన్సుల్లేవ్!



హీరోయిన్ సిమ్రాన్ ఇండస్ట్రీకి వచ్చి నేటి(ఆగస్టు 25)కి 30 ఏళ్లు పూర్తవుతుంది. హర్‌జై అనే హిందీ చిత్రంతో 1995లో కెరీర్ ప్రారంభించింది సిమ్రాన్. బాలీవుడ్‌లో కన్నా సౌత్‌లోనే ఎక్కువ స్టార్‌డమ్ తెచ్చుకుంది. తెలుగు, తమిళ భాషల్లో అనేక సినిమాలు చేసింది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హిందీలో నేను గుల్మోహర్ అనే సినిమా చేశాను. ఆ మూవీ టీమ్ అంతా కూడా చాలామంచివారు. అదే సమయంలో మరో ప్రాజెక్ట్ కూడా చేశాను. కానీ, అక్కడ ఎవరితోనూ కనెక్ట్ కాలేకపోయాను. పైగా ఇక్కడ పాత్రకు నేను సూట్ అవుతానా? లేదా? అని లుక్ టెస్ట్ చేస్తుంటారు. అందుకు నేను అభ్యంతరమేమీ చెప్పను. ఓకే కానీ, కొందరు నాగురించి తెలియక.. పాత్రకు సరిపోతానో? లేదోనని వీడియో చేసి పంపించమంటారు. అంతేకాకుండా.. సౌత్ ఇండస్ట్రీలో ఇచ్చే రెమ్యునరేషన్‌లో పదో వంతు మాత్రమే చెల్లిస్తారు. అందుకే నా గురించి పూర్తిగా తెలుసుకున్నవారి దగ్గరే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాను. టూరిస్ట్ ఫ్యామిలీ తర్వాత చిన్న, మధ్య తరహా సినిమా అవకాశాలు చాలానే వచ్చాయి. అందులోనూ మహిళా ప్రాధాన్యత ఉన్న స్క్రిప్టులే ఎక్కువ! కానీ, పెద్ద ప్రొడక్షన్ హౌస్ నుంచి, బడా దర్శకనిర్మాతల నుంచి మాత్రం ఒక్క ఆఫర్ కూడా రాలేదు. నా కెరీర్‌లో చాలా హిట్లు ఉన్నాయి. ఎంతోమంది యంగ్ టాలెంట్ నన్ను ఆదర్శంగా తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది అని చెప్పుకొచ్చింది. ఈ ఏడాది సిమ్రాన్ ఫుల్ బిజీ. శబ్దంతో అలరించిన ఆమె గుడ్ బ్యాడ్ అగ్లీలో అతిథి పాత్రలో మెరిసింది. టూరిస్ట్ ఫ్యామిలీతో సూపర్ హిట్టు అందుకుంది. ప్రస్తుతం ద లాస్ట్ వన్ అనే మూవీలో యాక్ట్ చేస్తోంది. విక్రమ్ సరసన నటించిన ధ్రువ నక్షత్రం ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు.



# పెద్ది సినిమాను తిరస్కరించిన నటి

ప్రస్తుతం ఇండియాలోనే టాప్ స్టార్లలో ఒకడు రామ్ చరణ్. ఆర్ఆర్ఆర్ సినిమాతో అతను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాడు. అలాంటి హీరో సినిమాలో కీలక పాత్ర చేయమంటే ఏ నటి అయినా సంతోషంగా ఒప్పుకుంటుంది. కానీ మలయాళ నటి స్వశిక మాత్రం చరణ్ కొత్త చిత్రం పెద్ది కోసం అడిగితే నో చెప్పేసిందట. ఆ చిత్ర బృందం నుంచి తనను మళ్లీ మళ్లీ అడిగినా ఆ సినిమా చేయను అనేసిందట. ఇంత క్రేజీ ప్రాజెక్టులో నటించడానికి ఆమెకు వచ్చిన అభ్యంతరం ఏంటి అనిపించడం సహజం. ఐతే ఇందులో ఆమెకు ఆఫర్ చేసింది చరణ్ తల్లి పాత్ర అట.స్వశిక వయసు ప్రస్తుతం 33 ఏళ్లే. రామ్ చరణ్‌కేమో 40 ఏళ్లు వచ్చేశాయి. స్వశిక తమిళ, మలయాళ భాషల్లో కొన్ని మిడిలేజ్డ్ పాత్రలు చేసిన మాట వాస్తవం. ఆమె ఎక్కువగా క్యారెక్టర్ రోల్సే చేస్తోంది. అంత మాత్రాన చరణ్ కంటే ఏడేళ్లు తక్కువ వయసున్న అమ్మాయిని తనకు తల్లిగా నటించమని అంటే ఫీలవ్వకుండా ఉంటుందా? తాను ఇప్పుడే ఆ తరహా పాత్రలు చేయాలనుకోవడం లేదని.. అందుకే ఆ సినిమాకు ఎన్నిసార్లు అడిగినా ఓకే చెప్పలేదని స్వశిక వెల్లడించింది. స్వశిక 2009 నుంచి సినిమాల్లో నటిస్తోంది. తమిళంలో వాగై అనే చిత్రంతో ఆమె కథానాయికగా పరిచయం అయింది. తర్వాత తమిళం, మలయాళంలో పలు చిత్రాల్లో నటించింది. తెలుగులోనూ ఎటు చూసినా నువ్వే అనే చిన్న సినిమాలో నటించింది స్వశిక. ఐతే ఈ మధ్య తమిళం, మలయాళంలో ఆమె చేసిన కొన్ని క్యారెక్టర్ రోల్స్ బాగా క్లిక్ అయ్యాయి. ముఖ్యంగా సూరి హీరోగా చేసిన మామన్ చిత్రంలో ఆమె చేసిన అక్క పాత్రకు చాలా పేరొచ్చింది. అదే సమయంలో ఆమె తెలుగులోకి తమ్ముడు చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో అడవిలో ట్రక్కు నడిపే వెరైటీ పాత్రలో నటించింది స్వశిక. కానీ ఆ చిత్రం డిజాస్టర్ కావడంతో ఆమెకు తెలుగులో బ్రేక్ రాలేదు. చరణ్ సినిమాలో తల్లి పాత్ర చేస్తే మంచి పేరే వచ్చేదేమో కానీ.. అది తన వయసుకు తగ్గ పాత్ర కాకపోవడంతో నో చెప్పింది. ప్రస్తుతం తమిళంలో ఆమె సూర్య హీరోగా నటిస్తున్న కరుప్పు చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. తమిళం, మలయాళంలో ఆమె చేతిలో చాలా సినిమాలే ఉన్నాయి.

# కూలీ, వార్ 2 చిత్రాలు ఆ చిన్న సినిమా ముందు తేలిపోయాయా.. ఇది కదా సక్సెస్ అంటే..




ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో ఒక కొత్త ట్రెండ్ నెలకొంది . పెద్ద హీరోలు, భారీ బడ్జెట్, గ్రాండియర్ సెట్‌లు, హైఎండ్ గ్రాఫిక్స్, పాన్ ఇండియా రిలీజ్‌లతో తెగ హంగామా చేస్తున్నారు. కానీ ఈ డిజైన్‌లో ఒక పెద్ద లోపం కనిపిస్తోంది, అదే "కథ". సినిమాకు ప్రాణం కథే అయినా, ఈ మధ్యకాలంలో దాన్ని పక్కనబెట్టి మార్కెటింగ్ అండ్ మ్యాగ్నిట్యూడ్ మీదే ఫోకస్ పెరిగిపోతోంది. ఫలితంగా, వందల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమాలు కథ లేకపోవడంతో డిజాస్టర్‌గా మిగులుతున్నాయి. అదే సమయంలో మంచి కథతో రూపొందిన చిన్న సినిమాలు మాత్రం ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆ కోవలోకే వస్తుంది సు ఫ్రమ్ సో. సు ఫ్రమ్ సో , ఓ కన్నడ హారర్ కామెడీ చిత్రం కాగా, ఆగస్టు 8న విడుదలైన ఈ సినిమా తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చింది. పెద్ద హైప్ లేకుండా రిలీజైనప్పటికీ, సినిమా విడుదలైన మొదటి రోజు నుంచే బలమైన మౌత్ టాక్‌ను సంపాదించింది. కేవలం రూ.6 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.35 కోట్లు వసూలు చేయడం గమనార్హం. అది కూడా ఎక్కువగా కన్నడ వెర్షన్ నుంచే. తెలుగులోనూ ఈ సినిమాకు భారీ స్పందన లభిస్తోంది. మూడు వారాలు దాటినా ఇంకా థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. వార్ 2 (ఎన్టీఆర్ -హృతిక్ రోషన్ కాంబో) ,కూలీ (రజినీకాంత్ %-% నాగార్జున కాంబో) వంటి పాన్ ఇండియా బిగ్గీలను కూడా బాక్సాఫీస్ పరంగా పక్కకు నెట్టి సు ఫ్రమ్ సో చిత్రం బాక్సాఫీస్‌ని షేక్ చేస్తుంది. రెండు భారీ పాన్ ఇండియా చిత్రాల నడుమ విడుదలైన ఈ చిత్రం లాభాల బాట పట్టడం నిజంగా గొప్ప విషయం. సు ఫ్రమ్ సో సినిమా విషయానికి వస్తే.. జెపి తుమినాడ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో జెపి తుమినాడ్, షనీల్ గౌతమ్, రాజ్ బి శెట్టి, ప్రకాష్ తుమినాడ్, సంధ్య అరకెరె లు కీలక పాత్రలు పోషించారు.అలాగే ఈ సినిమాని కన్నడలో శశిధర్ శెట్టి బరోడా, రవి రాయ్ కైలాస, రాజ్.బి. శెట్టి లు నిర్మించగా తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ విడుదల చేసారు.. చిన్న సినిమాగా వచ్చిన ఈ చిత్రం మంచి విజయం సాధించడంతో ఇది కదా అసలైన సక్సెస్ అంటే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,